నీలగిరి నిత్యపద్యం

ఆటవెలది

తమతమగురువులను తప్పక కలవండి
జ్ఞప్తిచేసుకొనుడు జ్ఞాపకముల
విద్యతోనెగదర విజ్ఞానవంతులౌ
గురువె దైవమనుచు మరచిపోకు

మీ
విజయప్రసాద్ నలుమాసు
తెలుగు బోధకులు,కవి

# నీలగిరి ఎక్స్‌ప్రెస్

RNI - TELTEL/2023/87644

తెలుగు దిన పత్రిక



**విలేకరులు కావలెను**

తెలంగాణ &ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రాలలో (నీలగిరి ఎక్స్ ప్రెస్):
& చైతన్య గళం ఛానల్ లో పని చేయుటకు
- బ్యూరో ఇన్చార్జ్ లు- జిల్లా స్టాఫ్ రిపోర్టర్ లు -ఇన్చార్జ్ లు
- మండల రిపోర్టర్ లు
- క్రైమ్ రిపోర్టర్ లు
-జిల్లాల వారిగా ఆడ్ ఇన్చార్జ్ లు కావలెను. వివరాలకు మా
WHATS APP నంబర్:-
9705770909 సంప్రదించండి.



సంచిక : 171 | సంపుటి : 3 | తెలంగాణ | ఆంధ్రప్రదేశ్ | శుక్రవారం | 26-9-2025 పేజీలు -8 | వెల: రూ. 5.00




## ఐరాసలో నాకు అవమానం జరిగింది..

- సీక్రెట్ సర్వీస్ దర్యాప్తు చేపట్టాలి.
- అమెరికా అధ్యక్షుడు ట్రంప్

న్యూఢిల్లీ

ఐక్యరాజ్య సమితి సర్వసభ్య సమావేశంలో అమెరికా అధ్యక్షుడు ట్రంప్ కు చేదు అనుభవం ఎదురైన విషయం తెలిసిందే. ఐక్యరాజ్య సమితికి మంగళవారం సతీమణి మెలానియాతో కలిసి వెళ్లిన ఆయన.. జనరల్ అసెంబ్లీ 80వ సమావేశంలో ప్రసంగించారు. అయితే, జనరల్ అసెంబ్లీలో ప్రసంగించేందుకు వెళ్లే క్రమంలో తనకు ఎదురైన చేదు అనుభవాలపై ట్రంప్ తాజాగా

-మిగతా 2 లో




# నేటి నుంచి మద్యం టెండర్లు

## రాష్ట్రంలో 2,620 షాపులకు నోటిఫికేషన్

- రిజర్వేషన్లకు కుల ధ్రువీకరణ తప్పనిసరి!
- ముందస్తుగానే టెండర్లు నిర్వహిస్తున్న సర్కారు
- అక్టోబర్ 23న లక్కీ డిప్ ద్వారా కేటాయింపు.
- గ్రామాల్లో రాత్రి 10 గంటల వరకు వైన్ షాపులు క్లోజ్
- జిహెచ్ఎంసి పరిధిలో రాత్రి 11 వరకు ఛాన్స్..

**హైదరాబాద్ సెప్టెంబర్ 25 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)** తెలంగాణ రాష్ట్రంలో కొత్త మద్యం దుకాణాల ఏర్పాటు, కేటాయింపు ప్రక్రియకు సంబంధించిన మార్గదర్శకాలను ప్రభుత్వం తాజాగా జారీ చేసింది. రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న మొత్తం 2,620 మద్యం దుకాణాల లైసెన్సుల కోసం (శుక్రవారం) దరఖాస్తుల స్వీకరణ మొదలు కానుంది. ఈ దరఖాస్తుల స్వీకరణ ప్రక్రియ అక్టోబర్ 18వ తేదీ వరకు కొనసాగనుంది. అర్హులైన అభ్యర్థులు ఈ గడువులోగా తమ దరఖాస్తులను సమర్పించవచ్చు.

-మిగతా 2 లో

**దరఖాస్తు ఇలా**

| | | |
|---|---|---|
| ప్రారంభం | : | సెప్టెంబర్ 26, 2025 |
| చివరి తేదీ | : | అక్టోబర్ 18, 2025 |
| లక్కీ డిప్ | : | అక్టోబర్ 23, 2025 |
| షాపుల వాలిడిటీ | : | డిసెంబర్ 01, 2025 నుంచి నవంబర్ 30, 2027 |

**లైసెన్సు ఫీజు ఇలా**

| జనాభా | దరఖాస్తు ఫీజు (రూపాయల్లో) |
|---|---|
| 5 వేల లోపు | 50 లక్షలు |
| 5 వేల నుంచి 50 వేలు | 55 లక్షలు |
| 50 వేల నుంచి లక్ష | 60 లక్షలు |
| 1 లక్ష నుంచి 5 లక్షలు | 65 లక్షలు |
| 5 లక్షల నుంచి 20 లక్షలు | 85 లక్షలు |
| 20 లక్షలకు పైగా | 1 కోటీ 10 లక్షలు |



## గ్రూప్-1 విజేతలకు 27న నియామకపత్రాలు

- సీఎం రేవంత్ రెడ్డి చేతుల మీదుగా అందచేత
- సీఎస్ రామకృష్ణారావు వెల్లడి

**హైదరాబాద్, సెప్టెంబర్ 25 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)** తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ ద్వారా ఎంపికైన గ్రూప్ -1 అభ్యర్థులకు ఈనెల 27న రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిచే నియామక పత్రాలు అందించనున్నట్టు- రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు వెల్లడించారు. శనివారం సాయంత్రం శిల్పకళా వేదికలో నిర్వహించనున్న కార్యక్రమం ఏర్పాట్లపై సంబంధిత ఉన్నత అధికారులతో సి.ఎస్. టెలి కాన్ఫరెన్స్ నిర్వహించారు. గ్రూప్-1 ద్వారా ఎంపి-కై-న 563 మంది అభ్యర్థులకు అపాయింటెమంట్ ఆర్డర్లు అందిస్తారని సిఎస్ తెలిపారు. దాదాపు 18 శాఖలకు చెందిన అభ్యర్థులు ఉన్నారు. ఈ కార్యక్రమానికి గౌరవ రాష్ట్ర మంత్రులందరినీ కూడా ఆహ్వానిస్తున్నట్టు- సి.ఎస్ తెలిపారు. ఎంపికైన అభ్యర్థుల సర్టిఫికెట్ల పరిశీలన కార్యక్రమం ే

-మిగతా 2 లో



## వందే భారత్ రైళ్లు వచ్చేస్తున్నాయ్..!

- అక్టోబర్ 15న దూసుకెళ్లనున్న లగ్జరీ రైలు..!

న్యూఢిల్లీ,

భారతీయ రైల్వేశాఖ ప్రతిష్టాత్మకంగా వందే భారత్ ఎక్స్‌ప్రెస్ రైళ్లను ప్రవేశపెట్టింది. దేశవ్యాప్తంగా వివిధ మార్గాల్లో ఈ రైళ్లు దూసుకెళ్తున్నాయి. ప్రయాణికుల నుంచి సెమీ హైస్పీడ్ రైళ్లకు ఆదరణ లభిస్తున్నది. ఈ నేపథ్యంలో భారతీయ రైల్వేశాఖ సరికొత్తగా అంతర్జాతీయ సదుపాయాలతో వందే భారత్ స్లీపర్ వెర్షన్ రైళ్లను ప్రవేశపెట్టబోతున్నది. ఈ రైలు ట్రయల్ రన్‌ను సైతం వివిధ మార్గాల్లో విజయవంతంగా నిర్వహించింది. తాజాగా వందే భారత్ స్లీపర్ వెర్షన్‌పై కేంద్ర రైల్వేశాఖ మంత్రి అశ్విని వైష్ణవ్ కీలక అప్‌డేట్ అందించారు. స్లీపర్ రైళ్ల కార్యకలాపాలు అక్టోబర్ 15 తర్వాత ప్రారంభమవుతాయని తెలిపారు. రెండు రేక్ డిలివరీల కోసం భారత రైల్వేలు నిరీక్షిస్తున్నాయని.. ఈ క్రమంలో ప్రారంభోత్సవంలో కాస్త ఆలస్యం జరుగుతోందన్నారు.

-మిగతా 2 లో



## కాంగ్రెస్ పాలనలో ప్రజలపై పన్నుల భారం

- కొన్ని రాజకీయ పార్టీలు దేశ ప్రజలను తప్పుదారి పట్టించడానికి ప్రయత్నిస్తున్నాయి
- కాంగ్రెస్ ప్రభుత్వాల హయాంలో పన్నుల ద్వారా భారీ దోపిడీ
- తన ప్రభుత్వం పన్నులను గణనీయంగా తగ్గించింది
- ప్రధాని నరేంద్ర మోదీ

**హైదరాబాద్ సెప్టెంబర్ 25 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**

జీఎస్టీ రేట్ల తగ్గింపు అంశంపై కాంగ్రెస్‌తో పాటు ప్రతిపక్ష పార్టీలు ప్రజలను తప్పుదారి పట్టించాయని ప్రధాని నరేంద్ర మోదీ విమర్శించారు. టూత్‌పేస్ట్ నుంచి ట్రాక్టర్ల వరకు ప్రతి వస్తువు ధరలపై పన్నుభారం తగ్గిందని పేర్కొన్నారు. కాంగ్రెస్ నేతృత్వంలోని ప్రభుత్వాల హయాంలో పన్ను దోపిడీ జరిగిందన్న ఆయన.. భారీ పన్నులతో ప్రజలపై భారం మోపారని మండిపడ్డారు. ఉత్తరప్రదేశ్ అంతర్జాతీయ వాణిజ్య ప్రదర్శన ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మూడురోజుల కిందట జీఎస్టీ సంస్కరణలు అమలులోకి వచ్చాయని, ఇది

-మిగతా 2 లో

## సచివాలయంలో ఘనంగా బతుకమ్మ

- వేడుకలకు హాజరైన మంత్రులు సీతక్క, సురేఖ

హైదరాబాద్,

డా.బీఆర్ అంబేద్కర్ తెలంగాణ సచివాలయంలో తెలంగాణ సంస్కృతీ సంప్రదాయాలకు అద్దం పట్టే బతుకమ్మ ఉత్సవాలను గురువారం సాయంత్రం అత్యంత ఘనంగా నిర్వహించారు. రాష్ట్ర పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి, మహిళ శిశు సంక్షేమ శాఖ మంత్రి దనసరి అనసూయ సీతక్క, రాష్ట్ర అటవీ, పర్యావరణం, దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ ముఖ్య అతిథిలుగా హాజరయ్యారు. తెలంగాణ సచివాలయ ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో జరిగిన ఈ బతుకమ్మ ఉత్సవాలలో సచివాలయంలోని ఉన్నతాధికారుల నుండి అన్ని స్థాయిల్లోని మహిళా ఉద్యోగులు అత్యంత ఉత్సాహంతో పాల్గొన్నారు. తీరొక్క పూలతో పేర్చిన బతుకమ్మలతో మహిళా ఉద్యోగులు, వారి పిల్లలు, చిన్నారులు అంతా ఒక చోట చేరి ఆటపాటలతో సంబరాలు చేశారు. దాండియా, బతుకమ్మ ఆటపాటల మధ్య జరిగిన ఈ ఉత్సవాలలో సచివాలయ ఉన్నతాధికారులు,

-మిగతా 2 లో





## అల్పపీడన ప్రభావంతో మళ్లీ వర్షాలు

- రాగల ఐదురోజులు భారీ నుంచి అతిభారీ వర్షాలు
- హైదరాబాద్ వాతావరణకేంద్రం హెచ్చరిక
- ములుగు జిల్లాలో ఎడతెరిపి లేకుండా వాన

2 లో

## దేశాభివృద్ధికి జాతీయ రహదారుల పాత్ర కీలకం

### రూ.30 వేల కోట్లతో రోడ్ల నిర్మాణానికి కేంద్రం ఆమోదం

- రాష్ట్రంలో రూ. 550 కోట్లతో నూతన రహదారుల నిర్మాణం
- రూ.860 కోట్లతో 422 కి.మి. రోడ్లను రాష్టానికి మంజూరు
- కేంద్రమంత్రి నితిన్ గడ్కరీతో రహదారులపై చర్చ
- మీడియా సమావేశంలో వెల్లడించిన కిషన్ రెడ్డి
- కాంగ్రెస్, బిఆర్ఎస్‌లకు బిజెపి ఫోబియా పట్టుకుందని విమర్శలు



**న్యూఢిల్లీ, సెప్టెంబర్ 25 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)** దేశాభివృద్ధికి జాతీయ రహదారుల పాత్ర చాలా కీలకమని బిజెపి కేంద్రమంత్రి కిషన్ రెడ్డి తెలిపారు. మారుమూల ప్రాంతాల్లో కూడా అభివృద్ధికి సరైన అడుగులు పడుతున్నాయని అన్నారు. ఈ సందర్భంగా ఢిల్లీలో ఆయన మీడియాతో మాట్లాడుతూ..వివిధ రాష్ట్రాలతో తెలంగాణకు జాతీయ రహదారులు అనుసంధానం అయ్యాయని, జాతీయ రహదారుల నిర్వహణ వల్ల దేశవ్యాప్తంగా రోడ్డు ప్రమాదాలు తగ్గాయని తెలియజేశారు. కేంద్రమంత్రి నితిన్ గడ్కరీతో సమావేశమై తెలంగాణ రహదారులపై చర్చించానని, రాష్ట్రంలో రూ. 550 కోట్లతో నూతన

-మిగతా 2 లో

## "నీలగిరి ఎక్స్ ప్రెస్ " ఎఫెక్ట్

- ఫేక్ పోల్యూషన్ చెకింగ్‌పై రవాణా శాఖ నిఘా
- నకిలీ పోల్యూషన్ టోకెన్ల మాఫియా.. రవాణా శాఖ దాడులు
- 20 నకిలీ సర్టిఫికెట్ కేంద్రాల సీజ్




**హైదరాబాద్, సెప్టెంబర్ 25 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)** మహా నగరంతో పాటు రాష్ట్ర వ్యాప్తంగా ఫేక్ పోల్యూషన్ చెకింగ్ పాయింట్లు పెరుగుతున్న నేపథ్యంలో నీలగిరి ఎక్స్ ప్రెస్ స్పెషల్ డ్రైవ్ నిర్వహించి ఓ కథనం ప్రచురించింది దానిపై రవాణా శాఖ అధికారులు స్పందించి రవాణా శాఖ కఠిన చర్యలు చేపట్టింది. ఫేక్ సర్టిఫికెట్ పాయింట్లపై ప్రత్యేక నిఘా పెట్టింది ప్రజలు మోసపోవకుండా ఉండేందుకు ప్రత్యేక దృష్టి సారించిన రవాణా శాఖ అధికారులు ఇప్పటికే కొన్ని నకిలీ పోల్యూషన్ సర్టిఫికెట్ కేంద్రాలను సీజ్ చేశారు. చెకింగ్ మిషన్లు లేకుండానే టోకెన్లు ఇస్తున్న వాహనాలను కూడా స్వాధీనం చేసుకున్నారు.




## స్థానిక ఎన్నికల షెడ్యూల్ రేపే?..

- దసరా తర్వాత ఎప్పుడైనా నోటిఫికేషన్
- నేడు రేపు రిజర్వేషన్ల జీవో జారీ?
- ఇప్పటికే సిద్ధంచేసిన యంత్రాంగం!

10 లో



నీలగిరి ఎక్స్‌ప్రెస్
తెలుగు దిన పత్రిక



## ఐరాసలో నాకు అవమానం జరిగింది..

(మొదటి తరువాయి)

స్పందించారు. ఐరాసలో జరిగిన వరుస సాంకేతిక ప్రమాదాలు ఉద్దేశపూర్వక విధ్వంసక చర్యలని పేర్కొన్నారు. ఈ మేరకు ఆయా ఘటనలపై సీక్రెట్ సర్వీస్ దర్యాప్తు చేపట్టాలని ఆదేశాలు జారీ చేశారు. ఈ మేరకు ట్రూత్‌లో ట్రంప్ పోస్టు పెట్టారు. ఐరాసలో తనకు అవమానం జరిగిందని పేర్కొన్నారు. ఒక్కసారి కాదు, రెండు సార్లు కాదు.. ఏకంగా మూడు సార్లు దురదృష్టకర ఘటనలు జరిగినట్లు చెప్పారు. ఐరాసలో ప్రసంగించేందుకు వెళ్తుంటే ఎస్కలేటర్ ఆగిపోయిందన్నారు. ఆ తర్వాత టెలిప్రాంప్టర్ పని చేయలేదని అసహనం వ్యక్తం చేశారు. దాదాపు 15 నిమిషాల తర్వాత అది పనిచేయడం ప్రారంభమైనట్లు చెప్పారు. ఈ మూడు ఘటనలు దురుద్దేశపూర్వకంగానే కనిపిస్తున్నాయన్నారు. ఆయా ఘటనలపై విచారణకు ఆదేశించినట్లు ట్రంప్ తెలిపారు. అయితే, అదే సమయంలో తన ప్రసంగానికి మాత్రం అద్భుతమైన రివ్యూలు వచ్చినట్లు ట్రంప్ వివరించారు.

## గ్రూప్-1 విజేతలకు 27న నియామకపత్రాలు

(మొదటి తరువాయి)

ంపటిలోగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. అదేవిధంగా ఈ కార్యక్రమానికి ఒక్కొక్క అభ్యర్థికి చెందిన ఇద్దరు కుటుంబ సభ్యులను అనుమతించేలా చర్యలు తీసుకోవాలని అన్నారు. ఈ నియామకాల్లో అత్యధికంగా, రెవిన్యూ, హోం, పంచాయతీరాజ్ శాఖలకు చెందిన వారే అధికంగా ఉన్నందున, రెవిన్యూ, హోం, జిఎడి కార్యదర్శులు ఈ కార్యక్రమ నిర్వహణలో సమన్వయంతో ఏర్పాట్లు- పూర్తి చేయాలని సి.ఎస్. ఆదేశించారు. నియామక పత్రాలు పొందే అభ్యర్థులు రాబోయే 30 సంవత్సరాలలో సర్వీస్ లో ఉంటారు కాబట్టి, వీరికి హార్ధిక ఉత్తేజకరమైన వాతావరణంలో నియామక పత్రాలు అందచేయాలని, ప్రభుత్వ సర్వీస్ పట్ల వారికి ఉన్నత భావన కలిగేలా కార్యక్రమాన్ని నిర్వహించాలని అందుకు తగు ఏర్పాట్లు- చేయాలని సి.ఎస్ అధికారులను ఆదేశించారు. ఈ -టె-లి కాన్ఫరెన్స్ లో ప్రత్యేక ప్రధాన కార్యదర్శులు సబ్యసాచి ఘోష్, వికాస్ రాజ్, హోం శాఖ
ప్రత్యేక ప్రధాన కార్యదర్శి రవి గుప్తా, డీజీపీ జితేందర్, ముఖ్య కార్యదర్శులు బెనహర్ మహేష్ దత్ ఎక్కా, సందీప్ కుమార్ సుల్తానియా, కార్యదర్శులు లోకేష్ కుమార్, టీ-కే శ్రీదేవి, జిహెచ్ఎంసి కమిషనర్ ఆర్.వి.కర్ణన్, సమాచార పౌర సంబంధాల శాఖ ప్రత్యేక కమిషనర్ ప్రియాంక తదితర అధికారులు పాల్గొన్నారు.

## వందే భారత్ రైళ్లు వచ్చేస్తున్నాయ్..!

(మొదటి తరువాయి)

ఒకేసారి రెండు స్లీపర్ రైళ్లను ప్రారంభించాలని భావిస్తున్నామన్నారు. అవి రోజువారీ సేవల కోసం ఉద్దేశించినవని.. రెండు రేక్‌లు సిద్ధంగా ఉండాలన్నారు. రెండో రైలు అక్టోబర్ 15 నాటికి వచ్చే అవకాశం ఉందని తెలిపారు. అత్యాధునిక సదుపాయాలు, మెరుగైన భద్రత, ప్రయాణికులకు అనుకూలమైన సౌకర్యాలతో వందే భారత్ స్లీపర్ వెర్షన్‌ను రైల్వేశాఖ తీసుకువస్తున్నది. తొలి రైలు ఢిల్లీ-పాట్నా మధ్య రాకపోకలు సాగించనున్నది. ప్రస్తుతం రెండు ప్రాంతాల మధ్య ప్రయాణానికి 12నుంచి17 గంటల పడుతుందని.. స్లీపర్ వెర్షన్ అందుబాటులోకి వస్తే 11 గంటలకు తగ్గుతుందని భావిస్తున్నారు. ప్రోటోటైప్ వందే భారత్ స్లీపర్ రైలు 800 నుంచి 1200 కిలోమీటర్ల సుదూర ప్రాంతాలకు రాత్రిపూట ప్రయాణాల కోసం రైల్వేశాఖ తీర్చిదిద్దింది. ఇందులో 16 నుంచి 20 కోచ్‌లు ఉండనున్నాయి. ఫస్ట్ ఏసీ, సెకండ్ ఏసీ, థర్డ్ ఏసీతో పాటు రెండు జనరల్ ఫస్ట్ ఏసీ, సెకండ్, థర్డ్ కాకుండా, రెండు సీటింగ్ కం లగేజీ కోచ్‌లు సైతం ఉంటాయి. రైలులో దాదాపు 820 నుంచి 1200 మంది వరకు ప్రయాణం చేయొచ్చు. గంటకు 160 కిలోమీటర్ల వేగంతో దూసుకెళుతుంది. భద్రతతో పాటు, స్లీపర్ వెర్షన్‌లో యూఎస్‌బీ ఛార్జింగ్‌తో కూడిన ఇంటిగ్రేటెడ్ రీడింగ్ లైట్లు, పబ్లిక్ అనౌన్స్‌మెంట్, విజువల్ ఇన్ఫర్మేషన్ సిస్టమ్స్, మాడ్యులర్ ప్యాంట్రీలు, దివ్యాంగ ప్రయాణికుల కోసం ప్రత్యేక బెర్త్‌లు, టాయిలెట్స్ తదితర ప్రపంచస్థాయి సౌకర్యాలు ఉండనున్నాయి. మొదటి ఏసీ కోచ్‌లో వేడినీటితో కూడిన షవర్లు సైతం ఉంటాయి. సుదీర్ఘ ప్రయాణాల్లో ప్రయాణీకుల సౌకర్యాన్ని మెరుగుపరుచనున్నాయి. మధ్యతరగతి కోసం ఉద్దేశించిన రైలని.. ఛార్జీలు రాజధాని ఎక్స్‌ప్రెస్‌తో సమానంగా ఉంటాయని గతంలో కేంద్ర రైల్వేశాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్ తెలిపారు. వందే భారత్ స్లీపర్ రైళ్లు సౌకర్యవంతమైన, సరసమైన ప్రయాణ అనుభవాన్ని అందించడమే రైల్వేశాఖ లక్ష్యంగా పెట్టుకుందని ఆయన వివరించారు. అయితే, వందే భారత్ స్లీపర్ రైలును దేశవ్యాప్తంగా వివిధ నగరాల మధ్య నడిపేందుకు రైల్వేలు ప్రయత్నాలు చేస్తున్నాయి. న్యూఢిల్లీ-సికింద్రాబాద్, న్యూఢిల్లీ-హౌరా, ఢిల్లీ-పుణే, ముంబయి-ఢిల్లీ నగరాలను కలుపుతూ రైలు నడుపనున్నట్లు వార్తలు వచ్చాయి. తాజాగా పట్నా-ఢిల్లీ మధ్య స్లీపర్ రైలును ప్రారంభించేందుకు కేంద్రం ఏర్పాట్లు చేసింది.

## సచివాలయంలో ఘనంగా బతుకమ్మ

(మొదటి తరువాయి)

ఉద్యోగుల సంఘం నాయకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. సచివాలయ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు శ్రీనివాస్ రెడ్డి, మహిళా ఉద్యోగుల సంఘం అధ్యక్షురాలు రమాదేవి, సంఘం సభ్యులు శైలజ, మంగ, చంద్రకళ తదితరులు పాల్గొన్నారు.

## అల్పపీడన ప్రభావంతో మళ్లీ వర్షాలు

### రాగల ఐదురోజులు భారీ నుంచి అతిభారీ వర్షాలు
### హైదరాబాద్ వాతావరణకేంద్రం హెచ్చరిక
### ములుగు జిల్లాలో ఎడతెరిపి లేకుండా వాన

**హైదరాబాద్, సెప్టెంబర్ 25(నీలగిరి ఎక్స్ ప్రెస్)**



తెలంగాణలో రాగల ఐదురోజులు భారీ నుంచి అతిభారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం హెచ్చరించింది. ఈశాన్య బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం కొనసాగుతుందని.. దానికి అనుబంధంగా ఉపరితల ఆవర్తనం సగటున సముద్రమట్టానికి 5.8 కిలోమీటర్ల వరకు విస్తరించిందని ఉందని పేర్కొంది. రాగల 24గంటల్లో పశ్చిమ-వాయువ్య దిశగా వాయువ్య బంగాళాఖాతం వైపు కదిలే అవకాశం ఉందని తెలిపింది. తూర్పు-మధ్య దానికి ఆనుకొని ఉన్న ఉత్తర బంగాళాఖాతం మీదుగా మరో అల్పపీడనం ఏర్పడే అవకాశం ఉందని తెలిపింది. 26వ తేదీ వరకు పశ్చిమ-మధ్య బంగాళాఖాతం, దక్షిణ ఒడిశా-ఉత్తరాంధ్ర తీర ప్రాంతాల్లో వాయుగుండంగా బలపడే అవకాశం ఉందని పేర్కొంది. 27వ తేదీ నాటికి తీరం దాటే అవకాశం ఉందని తెలిపింది. ఏపీ, తెలంగాణ మీదుగా సముద్రమట్టానికి ఉపరితల ఆవర్తనం కొనసాగుతుందని పేర్కొంది. గురువారం ఆదిలాబాద్, ఆసిఫాబాద్, మంచిర్యాల, నిర్మల్, పెద్దపల్లి, భూపాలపల్లి, ములుగు, కొత్తగూడెం, మహబూబాబాద్, వరంగల్, హనుమకొండ జిల్లాల్లో అక్కడక్కడ భారీ నుంచి అతిభారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని తెలిపింది.

# నేటి నుంచి మద్యం టెండర్లు

(మొదటి తరువాయి)

**షెడ్యూల్, కాలపరిమితి:**
ప్రభుత్వం జారీ చేసిన షెడ్యూల్ ప్రకారం, దరఖాస్తుల స్వీకరణ పూర్తయిన అనంతరం, అక్టోబర్ 23వ తేదీన లాటరీ పద్ధతి ద్వారా ఈ దుకాణాలను కేటాయించనున్నారు. ఎక్సైజ్ శాఖ జారీ చేయబోయే ఈ కొత్త లైసెన్సుల కాలపరిమితి రెండేళ్లు. ఈ లైసెన్సులు 2025 డిసెంబర్ 1వ తేదీ నుంచి 2027 నవంబర్ 30వ తేదీ వరకు అమల్లో ఉంటాయి.

**దరఖాస్తు రుసుం, అనర్హతలు:**
కొత్త మద్యం దుకాణాల లైసెన్స్ కోసం దరఖాస్తు చేసుకునేందుకు ప్రభుత్వం రూ. 3 లక్షల దరఖాస్తు రుసుమును నిర్ణయించింది. ఇది తిరిగి చెల్లించబడని (నాన్-రిఫండబుల్) రుసుము. దరఖాస్తుదారుల అర్హతల విషయంలోనూ ప్రభుత్వం కఠినంగా ఉంది. ఎక్సైజ్ చట్టం 1968 ప్రకారం శిక్షకు గురైన వారు, లేదా ప్రభుత్వానికి బకాయిలు పడి, వాటిని సక్రమంగా చెల్లించని వారు ఈ దుకాణాలను పొందేందుకు అనర్హులుగా పరిగణించబడతారు. అటువంటి అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవద్దని అధికారులు స్పష్టం చేశారు.

**రిజర్వేషన్లు, కుల ధ్రువీకరణ పత్రం తప్పనిసరి:**
ఈసారి మద్యం దుకాణాల కేటాయింపుల్లో సామాజిక న్యాయాన్ని పాటిస్తూ ప్రభుత్వం రిజర్వేషన్లను కల్పించింది. గౌడ సామాజిక వర్గం వారికి మొత్తం దుకాణాల్లో 15 శాతం రిజర్వేషన్ కేటాయించగా, షెడ్యూల్డ్ కులాల (ఎస్సీ) వారికి 10 శాతం, షెడ్యూల్డ్ తెగల (ఎస్టీ) వారికి 5 శాతం రిజర్వేషన్లను కల్పించనున్నారు.
అయితే, రిజర్వేషన్ల కింద దరఖాస్తు చేసుకునే అభ్యర్థులకు అధికారులు ఒక ముఖ్యమైన నిబంధన విధించారు. రిజర్వేషన్ కేటగిరీల (గౌడ, ఎస్సీ, ఎస్టీ) కింద దరఖాస్తు చేసేవారు తప్పనిసరిగా తమ కుల ధ్రువీకరణ పత్రాన్ని దరఖాస్తుతో పాటు జతచేయాల్సి ఉంటుంది. కుల ధ్రువీకరణ పత్రం లేకుండా సమర్పించిన రిజర్వేషన్ దరఖాస్తులు పరిగణించబడవు. ఈ పత్రం తప్పనిసరి నిబంధన రిజర్వేషన్ల లబ్ధి సరైన వ్యక్తులకు అందేలా చూసేందుకు ఉద్దేశించినట్లు అధికారులు తెలిపారు. తెలంగాణ ఎక్సైజ్ శాఖ ఆధ్వర్యంలో జరగనున్న ఈ ప్రక్రియ రాష్ట్ర ఆర్థిక వ్యవస్థపై ప్రభావం చూపనుండగా, లైసెన్స్ ఆశావహులు ఈ మార్గదర్శకాలను, షెడ్యూల్‌ను నిశితంగా గమనించి, గడువులోగా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

# దేశాభివృద్ధికి జాతీయ రహదారుల పాత్ర కీలకం

(మొదటి తరువాయి)

రహదారులకు నిర్మాణం చేపట్టాం అని పేర్కొన్నారు. రూ.860 కోట్లతో 422 కి.మి. రోడ్లను రాష్ట్రానికి మంజూరు చేశామని, రూ.30 వేల కోట్లకు పైగా నూతన జాతీయ రహదారుల నిర్మాణానికి కేంద్రం ఆమోదం తెలిపిందని కిషన్ రెడ్డి స్పష్టం చేశారు. ప్రజాప్రతినిధిగా.. తెలంగాణ రాష్ట్రానికి నిధులు, ప్రాజెక్టులు రావాలని, ప్రజలకు మేలు జరగాలని కోరుకునే వ్యక్తుల్లో ముందువరసలో నేనుంటాను.. మా మంత్రిత్వ శాఖలో.. తెలంగాణ ప్రాజెక్టులకోసం స్పెషల్ సెల్ ఏర్పాటు చేసుకుని.. అన్నిరకాల అభివృద్ధి పనులను మానిటర్ చేస్తున్నాను.. మా పార్టీ తెలంగాణ అభివృద్ధికి చిత్త శుద్ధితో పనిచేస్తుంది.. రీజనల్ రింగ్ రోడ్డు, హైదరాబాద్ మెట్రో విషయంలో.. అందరికంటే ముందే మేం ప్రొయాక్టివ్ గా వ్యవహరించామని తెలిపారు. ట్రిపుల్ ఆర్ కు ముందుగానే కేంద్ర ప్రభుత్వం ప్రతిపాదనలు పంపింది.. మెట్రో విషయంలో.. రాష్ట్ర ప్రభుత్వం ఆలోచన చేయాలి.. ఆర్థిక సంస్థలు రుణాలు ఇస్తున్నప్పుడు.. చాలా విషయాలపై స్పష్టత కావాలని అడుగుతారు.. మెట్రో విషయంలో కేంద్ర పట్టణాభివృద్ధి శాఖ మంత్రిని కలిసినపుడు.. వారు చాలా స్పష్టంగా చెప్పారు.. ఇప్పుడు మెట్రో రైల్ నిర్వహిస్తున్న ఎల్ అండ్ టి కొత్తగా నిర్మాణం చేపట్టనున్న కంపెనీ మధ్య ఏమైనా ఒప్పందం జరిగిందా అని ప్రశ్నించారు.. హైదరాబాద్ మెట్రో ఇప్పటికే నష్టాల్లో నడుస్తోంది.. ఇది రాష్ట్ర ప్రభుత్వంలోని అంశం. అది రాష్ట్ర ప్రభుత్వ వ్యవహారం. దీన్ని వారే తేల్చుకోవాలి.. మెట్రో అంశానికి అన్నిరకాలుగా మా సహకారం ఉంటుందని కిషన్ రెడ్డి తెలిపారు. కాళేశ్వరం పై సీబీఐ ప్రతిపాదనలు అందాయని పరిశీలనలో ఉందని తెలిపారు. బీఆర్ఎస్ కాంగ్రెస్ పార్టీలకు బీజేపీ ఫోబియా పట్టుకుంది... రెండు పార్టీలు అర్థం పర్థం లేకుండా, ఆధారాల్లేకుండా.. మాట్లాడుతున్నారు. మీరు మాకు నీతులు చెప్పాల్సిన అవసరం లేదు. తెలంగాణలో ఎప్పుడు ఎన్నికలు వచ్చినా.. మేం ఇండిపెండెంట్ గా ముందుకెళ్తాం.. ఈ రెండు పార్టీలకు ప్రత్యామ్నాయంగా.. బీజేపీని అధికారంలోకి తీసుకొచ్చే దిశగా పనిచేస్తున్నాం.. బీసీ రిజర్వేషన్ పెరగాలని అసెంబ్లీలో మద్దతిచ్చాం.. ఇది కేంద్ర ప్రభుత్వం పరిధిలోని అంశం కాదు. కాంగ్రెస్ పార్టీ తమ మేనిఫెస్టోలో పేర్కొన్నట్లుగా.. 42శాతం బిసి రిజర్వేషన్లు అమలు చేయాలన్నారు. ఇదే సందర్భంలో సీఎం రేవంత్ రెడ్డిపై కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి సంచలన వ్యాఖ్యలు చేశారు. బీజేపీపై ప్రతి ఒక్కరూ ఆరోపణలు చేసే ప్రయత్నం చేస్తున్నారని మండిపడ్డారు. కాంగ్రెస్, బి ఆర్ ఎస్ పార్టీల నేతలు విచిత్రమైన మానసిక వ్యాధితో బాధపడుతున్నారని అన్నారు. వాళ్లకు బిజెపి ఫోబియా పట్టుకుందన్నారు. చిల్లర మాటలు, అవగాహన లేకుండా, ఆధారాలు లేకుండా మాట్లాడుతున్నారని తెలిపారు. బిజెపికి తెలంగాణలో ఎవరితో కలవాల్సిన అవసరం లేదన్నారు. కెసిఆర్, కేటీఆర్, బిఆర్ఎస్, కాంగ్రెస్‌లతో బిజెపి ఎప్పుడు కలవదని స్పష్టం చేశారు. కలిసి కాపురాలు చేసింది మీరు.. ఎన్నికల్లో పొత్తులు పెట్టుకుంది మీరు.. మంత్రి పదవులు పంచుకుంది మీరు.. బిజెపికి ఎటువంటి అవసరం లేదని ఫైర్ అయ్యారు. తెలంగాణలో ఎప్పుడు ఎన్నికలు వచ్చినా స్వతంత్రంగా పోటీ- చేస్తాం.. టిఆర్ఎస్, కాంగ్రెస్లకు ప్రత్యామ్నాయంగా అధికారంలోకి వచ్చేందుకే మా ప్రయత్నం చేస్తామని కిషన్ రెడ్డి తెలిపారు. ముఖ్యమంత్రి వ్యవహారశైలి సమంజసంగా లేదు. జెన్ జీ విషయంలో కేటీఆర్ వ్యాఖ్యలు దేశద్రోహ వ్యాఖ్యలు.. నేపాల్ లో జరిగినట్లుగా.. పీఎం ఇంటిపైనా, మంత్రుల ఇంటిపైనా.. న్యాయస్థానాలపైనా దాడులు జరిగినట్లుగా.. ఇక్కడ జరగాలని కేటీఆర్ భావిస్తున్నారా? బాబా సాహెబ్ అంబేద్కర్ రాసిన రాజ్యాంగం ఇక్కడ అమలవుతోంది.. దేశంలో సమర్థవంతమైన నాయకత్వం ఉంది. అభివృద్ధి వేగవంతంగా సాగుతోంది. ప్రపంచ దేశాలతో పోలిస్తే.. మనం వేగంగా పురోగతి సాధిస్తున్నాం. ఇలాంటి పరిస్థితుల్లో.. కొందరు దివాళాకోరు మాటలు మాట్లాడం సరికాదు. ప్రజలు ఇలాంటి వ్యాఖ్యలను ఖండించాలని సంచలన వ్యాఖ్యలు చేశారు.

# కాంగ్రెస్ పాలనలో ప్రజలపై పన్నుల భారం

(మొదటి తరువాయి)

నిర్మాణాత్మక మార్పుగా పేర్కొన్నారు. ఇవి భారతదేశ వృద్ధి కథకు కొత్త ఉత్సాహాన్ని ఇస్తాయని తెలిపారు. ఈ సంస్కరణలు జీఎస్టీ నమోదును సులభతరం చేస్తాయని.. పన్ను వివాదాలను తగ్గిస్తాయన్నారు. ఎంఎస్ఎంఈలకు రిటర్న్లను వేగవంతం చేస్తాయని.. ప్రతి రంగానికి ప్రయోజనం చేకూరుస్తాయన్నారు. కొన్ని రాజకీయ పార్టీలు దేశ ప్రజలను తప్పుదారి పట్టించడానికి ప్రయత్నిస్తాయన్నారు. 2014కి ముందు అధికారంలో ఉన్న కాంగ్రెస్, మిత్రపక్షాలు తమ ప్రభుత్వ వైఫల్యాలను దాచడానికి ప్రజలకు అబద్ధాలు చెబుతున్నాయని ఆరోపించారు. కాంగ్రెస్ ప్రభుత్వాల హయాంలో పన్నుల ద్వారా భారీ దోపిడీ జరిగిందని.. దోచుకున్న డబ్బును మరింత దోచుకున్నారని.. దేశంలోని సామాన్య పౌరుడు పన్ను భారంతో ఇబ్బందిపడ్డాడని ప్రధాని పేర్కొన్నారు. తన ప్రభుత్వం పన్నులను గణనీయంగా తగ్గించిందని, ద్రవ్యోల్బణాన్ని అరికట్టిందని, ప్రజల ఆదాయంతో పాటు పొదుపును పెంచిందన్నారు. రూ.12లక్షల వరకు ఆదాయాన్ని పన్ను నుంచి మినహాయించడం ద్వారా కొత్త జీఎస్టీ సంస్కరణలను అమలు చేయడం ద్వారా పౌరులు ఈ ఏడాది రూ.2.5లక్షల కోట్లు ఆదా చేస్తారన్నారు. దేశం జీఎస్టీతో పొదు పండుగ జరుపుకుంటోందన్నారు. 2014కి ముందు అధిక పన్ను భారం వ్యాపార ఖర్చరులు, గృహ బడ్జెట్‌ను నిర్వహించడం కష్టతరం చేసిందని.. 2014కి ముందు రూ.1000 రేటు ఉన్న చొక్కాపై రూ.170 పన్ను విధించారన్నారు. 2017లో జీఎస్టీ అమలులోకి వచ్చాకి ఈ పన్ను రూ.50కి తగ్గిందన్నారు. సెప్టెంబర్ 22న అమలులోకి వచ్చిన సంస్కరణలతో అదే రూ.1000 విలువైన షర్ట్‌పై జీఎస్టీ రూ.35 మాత్రమే చెల్లించాల్సి ఉంటుందన్నారు. 2014లో టూత్‌పేస్ట్, షాంపూ, హెయిర్ ఆయిల్, షేవింగ్ క్రీమ్ వంటి ముఖ్యమైన వస్తువులపై రూ.100 ఖర్చు చేస్తే రూ.31 పన్ను విధించారని, బిల్లు రూ.131 పెరిగిందని ఆరోపించారు. 2017లో జీఎస్టీ అమలులోకి వచ్చిన తర్వాత రూ.100 విలువైన వస్తువు ధర రూ.118కి తగ్గిందని, అంటే రూ.13 ఆదా అవుతుందని.. ఇటీవలి జీఎస్టీ సంస్కరణల తర్వాత ఈ ఖర్చు రూ.105కి తగ్గిందని, ఫలితంగా 2014 ముందు రేట్లతో పోలిస్తే ప్రజలకు మొత్తం రూ.26 ఆదా అవుతుందన్నారు. 2014లో నిత్యావసరాల కోసం ఏడాదికి రూ.లక్ష ఖర్చు చేసే కుటుంబం రూ.20వేల నుంచి రూ.25వేల వరకు పన్నులు చెల్లించాల్సి ఉంటుందని.. జీఎస్టీ సంస్కరణల తర్వాత రూ.5వేల నుంచి రూ.6వేలు మాత్రమే చెల్లిస్తుందన్నారు. 2014కి ముందు ట్రాక్టర్ కొనుగోలు చేసేందుకు రూ.70వేల కంటే ఎక్కువగా పన్ను చెల్లించేదని.. ఇప్పుడు అదే ట్రాక్టర్‌పై రూ.30వేల మాత్రమే ఖర్చు అవుతుందని.. రూ.40వేల కంటే ఎక్కువగానే ఆదా అవుతుందని ప్రధాని పేర్కొన్నారు. కాంగ్రెస్ పాలన నాటి రోజుల పోలిస్తే ప్రస్తుతం స్కూటర్ల ధరలు రూ.8వేల నుంచి రూ.9వేలు తగ్గుతాయన్నారు. సంస్కరణల పేద, మధ్య తరగతుల వారందరికీ జీఎస్టీ సంస్కరణలతో ప్రయోజనం చేకూరుస్తాయని ప్రధాని వివరించారు.

# ల్యాండ్ సెటిల్మెంట్ పేరిట డబ్బుల వసూళ్లు






### ● సిపిఐ జిల్లా కార్యదర్శి మంద పవన్‌పై ప్రభాకర్ తీవ్ర ఆరోపణలు

**హుస్నాబాద్, సెప్టెంబర్ 25 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
కోహెడ మండలం చెంచర్ చెర్వుపల్లి గ్రామానికి చెందిన తూటి ప్రభాకర్ రెడ్డి తన భూమి వివాద పరిష్కారానికి పేరుతో సిపిఐ జిల్లా కార్యదర్శి మంద పవన్ డబ్బులు వసూలు చేసి, తిరిగి ఇవ్వకుండా బెదిరింపులకు పాల్పడుతున్నాడని ఆరోపించారు. ఉద్యోగ రీత్యా హైదరాబాద్‌లో ఉంటున్న ప్రభాకర్ రెడ్డి, కాచపూర్ గ్రామ శివారులోని సర్వే నంబర్ 394/ఆ లో ఉన్న తన కుటుంబ భూమిపై వివాదం నెలకొన్న నేపథ్యంలో హుస్నాబాద్ న్యాయస్థానం నుండి ఇంజక్షన్ ఆర్డర్ పొందారు. ఈ వివాదాన్ని పరిష్కరిస్తానని చెప్పి మంద పవన్ తండ్రి సాంబయ్య మూడు లక్షల రూపాయలు డిమాండ్ చేయగా, గూగుల్ పే ద్వారా 1,15,000, నగదుగా 1,85,000 చెల్లించినట్లు ప్రభాకర్ తెలిపారు. అయితే, వాయిదాలు వేస్తూ ఎలాంటి సహాయం చేయకుండా, డబ్బులు తిరిగి అడిగితే "నా వెనక సిపిఐ పార్టీ, మంత్రి పొన్నం ప్రభాకర్ ఉన్నారు నచ్చిన చోట చెప్పుకో" అంటూ బెదిరింపులకు పాల్పడుతున్నారని ఆరోపించారు. సిద్దిపేట పోలీసులను ఆశ్రయించినా, వారం గడుస్తున్నా న్యాయం జరగకపోవడంతో మీడియా ద్వారా తన ఆవేదన వ్యక్తం చేస్తున్నట్లు తెలిపారు. తనకు ప్రాణహాని కలుగకుండా, తిరిగి డబ్బులు ఇప్పించి, తన కుటుంబాన్ని ఆదుకోవాలని మంత్రి పొన్నం ప్రభాకర్, సిపిఐ పార్టీ పెద్దలు జోక్యం చేసుకోవాలని బాధితుడు విజ్ఞప్తి చేశారు.

## 2025 సెప్టెంబర్ 26, శుక్రవారం తెలుగు పంచాంగం




**మాసం - పక్షం**

ఆశ్వయుజ మాసం, శుక్ల పక్షం

**తిథి**

**చవితి:** Sep **25 7:06** AM Sep **26 9:33** AM

**పంచమి:** Sep **26 9:33** AM Sep **27 1**2:04 PM

**నక్షత్రం**

**విశాఖ:** Sep 25 7:08 PM Sep 26 10:09 PM

**అనురాధ: ప్రారంభం** Sep 26 10:09 PM

**శుభ సమయాలు**

**బ్రహ్మ ముహూర్తం:** 4:33 - 5:21 AM

**అభిజిత్: 11:43** AM - 12:31 PM

**అమృతకాలం: 12:14** PM - 2:03 PM

**అశుభ సమయాలు**

**రాహుకాలం: 10:37** AM - 12:07 PM

**యమగండం: 3:06** PM - 4:36 PM

**గులికా: 7:38** AM - 9:08 AM

**దుర్ముహూర్తం:** 08:32- 09:20 AM, 12:31 - 1:18 PM

**వర్జ్యం: 02:39** AM - 04:27 AM



రంగా రెడ్డి జిల్లా షాద్ నగర్ శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి ఆలయంలో నవరాత్రుల్లో భాగంగా ఈ రోజు ధనలక్ష్మి అవతారంలో దర్శనమిచ్చిన అమ్మవారు

## సీసీ కెమెరాలను ప్రారంభించిన ఎస్పీ,ఎమ్మెల్యే





**దేవరకొండ,సెప్టెంబర్ 25(నీలగిరి ఎక్స్ ప్రెస్):**
దేవరకొండ పట్టణంలో నూతనంగా ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలను జిల్లా ఎస్పీ శరత్ చంద్ర పవార్ మరియు ఎమ్మెల్యే బాలు నాయక్ దేవరకొండ పోలీస్ స్టేషన్లో ప్రారంభించారు.అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ, నేరాల నియంత్రణతో పాటు నేరగాళ్లను గుర్తించడంలో సీసీ కెమెరాలు పోలీసు శాఖకు కీలకంగా ఉపయోగపడుతున్నాయన్నారు.రాష్ట్ర ప్రభుత్వం హైదరాబాద్ లో ఏర్పాటు చేసిన కమాండ్ కంట్రోల్ సెంటర్ ద్వారా ప్రతి కెమెరాను అనుసంధానం చేసి భద్రతాపరమైన సమస్యలు తలెత్తినప్పుడు క్షణాల్లో పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకునేలా ఏర్పాట్లు చేశారన్నారు. దేవరకొండ నియోజకవర్గంలో గ్రామాలలో మరియు పట్టణంలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు.ఈ కార్యక్రమంలో నల్గొండ జిల్లా ఎస్పీ శరత్ చంద్ర పవార్, అదనపు ఎస్పీ మౌనిక , ఆర్డిఓ రమణ రెడ్డి,సర్కిల్ ఇన్స్పెక్టర్ పి.వెంకట్ రెడ్డి, డాక్టర్ వేణుధర్ రెడ్డి,అల్లంపల్లి నరసింహ,హనుమంతు వేంకటేష్ గౌడ్, పోలీస్ శాఖ అధికారులు ,నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# గ్రూప్-1 ఫలితాల్లో మెరిసిన సాగర ఆణిముత్యం

### వావిలాల చిరంజీవి సాగర్



**వంగూరు, సెప్టెంబర్ 25(నీలగిరి ఎక్స్ ప్రెస్)**
నాగర్‌కర్నూల్ జిల్లా వంగూరు మండల పరిధిలోని పోతారెడ్డిపల్లి గ్రామానికి చెందిన వావిలాల కాశన్న, శకుంతల దంపతుల చిన్న కుమారుడు వావిలాల చిరంజీవి బుధవారం సాయంత్రం విడుదలైన గ్రూప్-1 ఫలితాల్లో రాష్ట్ర స్థాయిలో 169వ ర్యాంకు సాధించి డీఎస్పీ క్యాడర్‌లో అసిస్టెంట్ ఎక్సైజ్ సూపరింటెండెంట్ పదవిని పొందారు. చిన్నతనం నుంచి చదువుపట్ల ఆసక్తి కలిగిన చిరంజీవి విద్యారంగంలో అంచెలంచెలుగా ఎదుగుతూ ఐఐటీ మద్రాస్ వరకు చేరుకున్నారు.పోతారెడ్డిపల్లి ప్రాథమిక పాఠశాలలో మొదటి నుంచి నాలుగో తరగతి వరకు విద్యనభ్యసించిన ఆయన, రఘుపతిపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఐదో తరగతి నుంచి పదో తరగతి వరకు చదువుకున్నారు. ఇంటర్మీడియట్ విద్యను హైదరాబాద్‌లోని నారాయణ కాలేజీలో పూర్తి చేసి, బీటెక్ మరియు ఎంటెక్ విద్యను ఐఐటీ మద్రాస్‌లో అభ్యసించారు. 2013లో తొలిసారి ప్రభుత్వ ఉద్యోగం పొందిన చిరంజీవి ఆర్ అండ్ బి శాఖలో అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్‌గా నాగర్‌కర్నూల్‌లో విధులు నిర్వహించారు. ప్రస్తుతం మహబూబ్‌నగర్ ఆర్ అండ్ బి డివిజన్‌లో డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్‌గా పనిచేస్తున్నారు.గ్రూప్-1లో ప్రతిష్టాత్మక పదవి సాధించిన చిరంజీవికి గ్రామస్థులు, బంధువులు, మిత్రులు, సహచరులు హర్షం వ్యక్తం చేస్తూ అభినందనలు తెలియజేశారు. పోతారెడ్డిపల్లి గ్రామం నుంచి రాష్ట్ర స్థాయిలో ఉన్నత పదవికి ఎదిగిన చిరంజీవి విజయాన్ని గ్రామ ప్రజలు గర్వంగా భావిస్తున్నారు.

# యాచారం లో పండిట్ దీన్ దయాల్ ఉపాధ్యాయ జయంతి





**ఇబ్రహీంపట్నం, సెప్టెంబర్ 25 ( నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
పండిట్ దీన్ దయాల్ ఉపాధ్యాయ జయంతిని భారతీయ జనతా పార్టీ (బీజేపీ) ఆధ్వర్యంలో పండగలా నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. మరియు, సేవా కార్యక్రమాలు నిర్వహించారు. పండిత్ దీన్ దయాల్ ఉపాధ్యాయ జయంతిని పురస్కరించుకొని యాచారం మండల కేంద్రం లో బిజెపి మండల అధ్యక్షులు జరుపల విజయ్ నాయక్ అధ్యక్షతన జయంతి సందర్భం గా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళు లర్పించారు. అనంతరం మొక్కలు నాటారు. ఈకార్యక్రమనికి ముఖ్య అతిథిగా పాల్గొన్న కిసాన్ మోర్చా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మర్రిపల్లి అంజయ్య యాదవ్ మాట్లాడుతూ ఆ మహాత్ముని ఆలోచనలు అతను ఆవలంభించిన సిద్ధాంతాల వల్లనే భారతీయ జనతా పార్టీ ఈ స్థాయిలో ఉందని నరేంద్ర మోడీ కూడా అతను చెప్పిన సిద్ధాంతాలు ఆవలంబిస్తూ ముందుకు వెళ్తున్నారని అన్నారు. విజయ్ నాయక్ మాట్లాడుతూ...ఏకాత్మతా మానవతావాద సిద్ధాంతాన్ని ప్రతిపాదించి, అంత్యోదయ కార్యక్రమం రూపొందించి, ప్రపంచంలోనే అతిపెద్ద పార్టీగా అవతరించిన భారతీయ జనతా పార్టీకి పటిష్ట పునాదులు వేసిన మహనీయులు దీన్ దయాల్ ఉపాధ్యాయ అని అన్నారు. ఈకార్యక్రమం లోబిజెపి సీనియర్ నాయకులు విశ్రాంత ఉపాధ్యాయులు విష్ణు మూర్తి , బీజేపీ జిల్లా కార్యదర్శి రాజు, సేవ పక్వాడ జిల్లా కో కన్వీనర్ మధుకర్ రెడ్డి, ఓబీసీ మోర్చా రాష్ట్ర నాయకులు గోగికర్ రమేష్, బిజెపి మాజి అధ్యక్షులు తాండ్ర రవీందర్, మాజి సర్పంచ్ రాయకంటి విజయ్ కుమార్,దేవరకొండ ఈశ్వర్, సంతోష్ గుప్త, మాజి ఉపసర్పంచ్ పల్లపు నరేష్, పత్తి రాజు, గడ్డం దయాకర్, కొండాపురం నాగరాజు, సంగేమ్ శ్రీనాథ్, కుంచారం సందీప్ రెడ్డి, కాలే శ్రీశైలం, కుంటి మల్లేష్, గంగల శ్రీశైలం,తదితరులు పాల్గొన్నారు.

# ప్రతి రైతుకు అవసరమైన యూరియా అందించాలి

### ఎమ్మెల్యేనేనావత్ బాలు నాయక్.



**దేవరకొండ సెప్టెంబర్ 25.( నీలగిరి ఎక్స్ ప్రెస్).**
దేవరకొండ పట్టణంలోని ఎమ్మెల్యే అధికారిక క్యాంప్ కార్యాలయంలో అదనపు ఎస్పీ మౌనిక, రమణా రెడ్డి, మరియు వ్యవసాయ శాఖ అధికారులతో ఎమ్మెల్యే బాలు నాయక్ సమీక్ష సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, దేవరకొండ నియోజవర్గంలో ప్రస్తుతం ఉన్న యూరియా నిల్వల గురించి వ్యవసాయ అధికారులను అడిగి తెలుసుకున్నారు.కేంద్ర ప్రభుత్వం సకాలంలో యూరియా సరఫరా చేయని కారణంగానే రైతులు ఇబ్బందులు పడుతున్నారని,జిల్లాలోని ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘాల ద్వారా రైతులకు సరిపడా యూరియా అందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం చర్యలు చేపట్టిందని అన్నారు.
వ్యవసాయ శాఖ అధికారులు క్షేత్రస్థాయిలో యూరియా నిల్వలపై ఎప్పటికప్పుడు సమీక్షిస్తూ రైతులకు ఇబ్బందులు లేకుండా చూడాలని ఆదేశించారు. కొందరు ప్రతిపక్ష నాయకుల కుట్రలతో యూరియాపై లేనిపోని అపోహలు సృష్టిస్తున్నారని, అధికారులు అప్రమత్తంగా ఉండి రైతులకు యూరియా అందేలా చూడాలన్నారు. ప్రైవేట్ డీలర్ల వద్ద నిల్వలను తనిఖీ చేస్తూ రైతులకు సరఫరా చేసేలా చూడాలన్నారు. ఈ ప్రాంత రైతులకు కేటాయిస్తున్న యూరియా బ్లాక్ మార్కెట్ కు, దళారులకు విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.రైతులు ఎవరు ఆందోళన పడవద్దని కాంగ్రెస్ ప్రభుత్వం ప్రతి ఎకరాకు యూరియా అందిస్తుందని చెప్పారు. అధికారులు రైతులకు సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ నాయిని జమున మాధవ రెడ్డి,అదనపు ఎస్పీ మౌనిక, ఆర్డీవోరమణా రెడ్డి , ఏ డి ఏ శ్రీలక్ష్మి, మున్సిపల్ చైర్మన్ ఆలంపల్లి నర్సింహా, పిఏసిఎస్ చైర్మన్ దూదిపాల వేణుధర్ రెడ్డి, మాజీ ఎంపీపీ బిక్కు నాయక్, మండల పార్టీ అధ్యక్షులు కృష్ణయ్య,యూత్ కాంగ్రెస్ జిల్లా ఉపాధ్యక్షులు కొర్ర రాంసింగ్ నాయక్,అన్ని మండలాల ఏఓ లు, సీఈవో లు,పోలీస్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# పండిట్ దీన్ దయాళ్ ఉపాధ్యాయ గొప్ప మానవతావాది

### కేంద్ర మంత్రి బండి సంజయ్



**కరీంనగర్, సెప్టెంబర్ 25 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
“కొంతమంది మరణించే వరకు జీవిస్తారు. కొంతమంది మరణించిన తర్వాత కూడా జీవిస్తూనే ఉంటారు” ు ఈ రెండో కోవకు చెందిన మహనీయుడు పండిట్ దీన్ దయాళ్ ఉపాధ్యాయ అని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి శ్రీ బండి సంజయ్ కుమార్ ప్రశంసించారు. నవజ్యోల భారత మహానాయకుడిగా, ఈ శతాబ్దపు రుషిగా, గొప్ప రచయితగా, పాత్రికేయుడిగా, రాజనీతిజ్ఞుడిగా, ఏకాత్మతా మానవతా సిద్ధాంతాన్ని ప్రతిపాదించిన మానవతావాదిగా ఆయన సేవలు చిరస్మరణీయమని కొనియాడారు.పండిట్ దీన్ దయాళ్ ఉపాధ్యాయ జయంతిని పురస్కరించుకుని కరీంనగర్‌లో ఆయన చిత్రపటానికి పూలమాల వేసి ఘన నివాళి అర్పించారు. అనంతరం ఖాదీ వస్త్రాలను కొనుగోలు చేసి, స్వదేశీ భావనకు మద్దతు తెలిపారు. దీన్ దయాళ్ సేవలను స్మరిస్తూ ప్రకటన విడుదల చేశారు.ఈ దేశంలో ఒక్కరూ ఆకలితో అలమటించకూడదనే సంకల్పంతో “అంత్యోదయ” సిద్ధాంతాన్ని ప్రతిపాదించిన మహనీయుడు దీన్ దయాళ్ ఉపాధ్యాయ అని మంత్రి పేర్కొన్నారు. అధికారమే పరమావధిగా కాకుండా, సేవే లక్ష్యంగా రాజకీయాలను కొనసాగించాలని ఆయన చెప్పిన సందేశం నేటికీ ప్రాసంగికమని అన్నారు.దేశ రక్షణ కోసం నిరంతరం సిద్ధంగా ఉండే భారత సైన్యంతోపాటు, జన సంఘ్ కార్యకర్తలను కూడా పాకిస్తాన్‌తో జరిగిన యుద్ధానికి పంపిన గొప్ప దేశభక్తుడు దీన్ దయాళ్ అని బండి సంజయ్ గుర్తుచేశారు. ఆయన జీవితం, సిద్ధాంతాలు, సేవా దృక్పథం దేశ యువతకు మార్గదర్శకంగా నిలుస్తాయని పేర్కొన్నారు.

# మాడుగులలో పత్తి పంట పరిశీలన



**మాడుగుల, సెప్టెంబర్ 25(నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
మాడుగుల మండలంలోని ఇర్విన్, గిరి కొత్తపల్లి, నల్లచెరువు, రామ్ దుగ్యాల గ్రామాల్లో వానాకాలం సాగు చేస్తున్న పత్తి పంటలను జిల్లా వ్యవసాయ అధికారి శ్రీమతి ఉష పరిశీలించారు. పత్తిలో సస్యరక్షణ చర్యలు చేపట్టాలని రైతులకు సూచించారు. పంటల నమోదు ప్రక్రియను కూడా పరిశీలించారు. మండల కేంద్రంలోని ప్రాథమిక వ్యవసాయ సహకార కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి శ్రీమతి డి అరుణ కుమారి, విస్తరణ అధికారి శ్రీమతి కే జ్యోత్స్న, పిఎసిఎస్ సీఈవో యాదయ్య, రైతులు పాల్గొన్నారు.

## పండిట్ దీనదయాళ్ ఉపాధ్యాయ్ జయంతి సందర్భంగా సేవా పక్షం

**మొక్కల నాటిన బీజేపీ శ్రేణులు**



**ఆమనగల్, సెప్టెంబర్ 25(నీలగిరి ఎక్స్ ప్రెస్)**
ఆమనగల్ మున్సిపాలిటీ పరిధిలోని ఉదయ్ నగర్ కాలనీ 15వ వార్డు, 187 బూత్ వద్ద బీజేపీ కార్యకర్తలు పండిట్ దీనదయాళ్ ఉపాధ్యాయ్ జయంతిని పురస్కరించుకుని మొక్కలు నాటారు. సేవా పక్షం కార్యక్రమంలో భాగంగా నిర్వహించిన ఈ పర్యావరణ పరిరక్షణ కార్యక్రమం స్థానిక ప్రజలలో చైతన్యాన్ని నింపింది.పండిట్ దీనదయాళ్"అంత్యోదయ" సిద్ధాంతం ం సమాజంలో చివరి వ్యక్తి అభ్యున్నతే లక్ష్యంగా ం భారతీయ సమాజానికి సామాజిక న్యాయానికి కొత్త దిశను చూపింది. ఆయన మార్గదర్శకత్వం ఆధారంగా, సమకాలీన సమస్యలకు పరిష్కార మార్గాలు సూచిస్తూ, సమగ్ర అభివృద్ధికి బీజం పడింది.ఈ కార్యక్రమంలో ఆమనగల్ బీజేపీ అధ్యక్షుడు కర్నాటి విక్రమ్ రెడ్డి, జిల్లా కౌన్సిల్ సభ్యులు చెక్కల లక్ష్మణ్, జిల్లా ప్రధాన కార్యదర్శి గోరటి నరసింహ, మాజీ కౌన్సిలర్ చెన్నకేశవులు, పార్లమెంట్ బీజేవైఎం కో కన్వీనర్ రవి రాథోడ్, 187 బూత్ అధ్యక్షుడు తల్లోజు శ్రీను, బాలు నాయక్, వాసు, తల్లోజు నిఖిల్, కాలనీ ప్రజలు, బీజేపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఆర్షనపల్లి కి అరుదైన గౌరవం సీడ్ గ్రోయర్ గా సత్కరించిన వెంకటేశ్వరరావు



**ఎలిగేడు, సెప్టెంబర్ 25(నీలగిరి ఎక్స్ ప్రెస్):**
సీడ్ మెన్ అసోసియేషన్ హైదరాబాద్ 30వ వార్షిక దినోత్సవాన్ని పురస్కరించుకుని, మండలంలోని సుల్తాన్‌పూర్ గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ ఆర్షనపల్లి వెంకటేశ్వరరావు అరుదైన గౌరవాన్ని అందుకున్నారు. రాష్ట్ర మంత్రులు ఉత్తం కుమార్ రెడ్డి, తుమ్మల నాగేశ్వరరావు గురువారం జరిగిన కార్యక్రమంలో ఆయనను ఘనంగా సన్మానించారు.
**ఈ సందర్భంగా మంత్రులు మాట్లాడుతూ –**
వరి విత్తన ఉత్పత్తిలో ప్రత్యేక శ్రద్ధ చూపుతూ, హైబ్రిడ్ విత్తనాలు సహా వివిధ రకాల నాణ్యమైన విత్తనాలను పండించి, ప్రముఖ కంపెనీలకు సప్లై చేస్తున్న సేవలు ప్రశంసనీయం అన్నారు. మండలంలోని పలు గ్రామాల్లో రైతులకు నాణ్యమైన విత్తనాలు అందించేందుకు చేసిన కృషిని కొనియాడారు.
ఆయన చేసిన సేవలకు గుర్తింపుగా, సీడ్ మెన్ అసోసియేషన్ సంస్థ వెంకటేశ్వరరావును "సీడ్ గ్రోయర్"గా గౌరవించి, ప్రశంసా పత్రంతో సత్కరించింది.

# యాదాద్రి జిల్లా ఉద్యోగ సంఘాల నేతలకు పేరుపేరునా ధన్యవాదాలు...



**-సంఘటితంగా పోరాడి విజయం సాధించారు...**
**-టిజి ఎస్సిడిడి మినిస్టీరియల్ స్టాఫ్ అసోసియేషన్ అధ్యక్షులు ఉప్పు సత్యనారాయణ అభినందన....**

**యాదాద్రి భువనగిరి, సెప్టెంబర్ 25(నీలగిరి ఎక్స్ ప్రెస్)**
ఎస్ సి డి డి ఉద్యోగస్తులతో పాటు ఎవరికి ఏ ఆపద వచ్చినా అందుబాటులో ఉంటానని, పిలిస్తే పలుకుతానని తెలంగాణ షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి శాఖ మినిస్టీరియల్ స్టాఫ్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు ఉప్పు సత్యనారాయణ అన్నారు. షెడ్యూల్ కులాల అభివృద్ధి శాఖ సిబ్బందికి హాస్టల్ వెల్ఫేర్ అసోసియేషన్ అధికారులకు అండగా నిలబడ్డ సంఘాల నేతలందరికీ పేరుపేరునా ధన్యవాదాలు అని అన్నారు. గత మూడు రోజుల క్రితం షెడ్యూల్ కులాల అభివృద్ధి శాఖ ఎఫ్ఏసి డీఎస్సీడీవో కార్యాలయంలో జరిగిన ఘటనలో ఎస్సిడిడి జిల్లా కార్యాలయ సిబ్బందికి హాస్టల్ వెల్ఫేర్ ఆఫీసర్ అధికారులకు సంఘీభావంగా విచ్చేసినటువంటి టీఎన్జీవో నేతలకు, ఎస్సిడిడి స్టాప్ అసోసియేషన్ కు నాలుగవ తరగతి ఉద్యోగుల సంఘానికి ధన్యవాదాల కార్యక్రమంలో ఉప్పు సత్యనారాయణ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సంఘటితంగా పోరాడితే సాధించనిదేమీ లేదని, ఐక్యతతో ముందుకు సాగాలని ఆయన కోరారు. సమస్యలు ఏమైనా ఉంటే సామరస్యకంగా పరిష్కరించుకోవాలని ఒంటెద్దు పోకడలు మానుకోవాలని అధికారులను ఆయన కోరారు. ఉద్యోగ సంఘాలన్నీ ఒక తాటి మీదికి రావడంతోనే జిల్లా అధికారులు ఆలోచించే పరిస్థితి ఏర్పడిందని, ఇది ఒక శుభ పరిణామం ఆయన అని అన్నారు. భవిష్యత్తులో ఇలాంటి పరిణామాలు రాష్ట్రంలో ఎక్కడ ఏర్పడిన ఈ విధంగా సంఘటితంగా ఉండి పోరాడాలని హితవు పలికారు. ఈ సందర్భంగా యాదాద్రి జిల్లా డి ఎస్ సి డి ఓ సిబ్బందికి అండగా నిలబడిన జిల్లా టీఎన్జీవో అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు భగత్ , ఖదీర్, హాస్టల్ వెల్ఫేర్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షురాలు శైలజ రేఖల, అసోసియేట్ అధ్యక్షులు కే.ఆనంద్, నాలుగో తరగతి ఉద్యోగ సంఘం జిల్లా అధ్యక్షులు సురేష్ తదితరులకు ఉప్పు సత్యనారాయణ ధన్యవాదాలు తెలిపారు. ఈ సందర్భంగా రాష్ట్ర అధ్యక్షులుగా ఎన్నికైన సందర్భంగా ఆయా సంఘాల నేతలు ఆత్మీయ సత్కారం చేశారు. ఈ కార్యక్రమంలో కార్యాలయ సూపరెంటెండెంట్ జ్యోతిర్మయి, హాస్టల్ వెల్ఫేర్ ఆఫీసర్స్ అసోసియేషన్ జిల్లా నేతలు ఏఎస్ డబ్ల్యూఓ విశ్వనాథ్, సుక్క ఆనంద్, మినిస్టీరియల్ స్టాఫ్ అసోసియేషన్ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు విజయవర్ధన్, అన్నపు రెడ్డి వెంకట్ రెడ్డి, రామ్ చందర్, కే.అనురూప, నాలుగవ తరగతి ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షులు సురేష్, మల్లికార్జున చారి, మహేష్, రాహుల్, కవిత, పరశురాం, రాము తదితరులు కార్యక్రమంలో పాల్గొన్నారు.

## భవాని దేవి అవతారంలో అమ్మవారు దర్శనం



**కడ్తాల్, సెప్టెంబర్ 25 ( నీలగిరి ఎక్స్ ప్రెస్ )**
మండలంలోని మైసిగండి శివాలయ రామాలయ ఆలయంలో దసరా నవరాత్రి ఉత్సవాల నేపథ్యంలో గురువారం భవాని అమ్మవారుగా భక్తులకు దర్శనమిచ్చారు. అమ్మవారికి భక్తులు పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆయాల చైర్ పర్సన్ సిరోలి పంతు, ఈఓ, భక్తులు పాల్గొన్నారు.

## అమ్మవారికి మహేష్ దంపతుల ప్రత్యేకపూజలు



**కడ్తాల్, సెప్టెంబర్ 25 ( నీలగిరి ఎక్స్ ప్రెస్ )**
కడ్తాల్ మండల కేంద్రంలో శ్రీ దుర్గా మాత మిత్రమండలి ఆధ్వర్యంలో నెలకొల్పినటువంటి దేవీ నవరాత్రుల ఉత్సవాలలో భాగంగా గురువారం అన్నపూర్ణ దేవి అవతారం సందర్భంగా అమ్మవారికి బీజేపీ మండల అధ్యక్షుడు దోనాదుల మహేష్ లక్ష్మీ ప్రియ దంపతులు కుటుంబ సభ్యులతో కలిసి ప్రత్యేక పూజలు నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఉత్సవ కమిటీ సభ్యులు మాదారం మహేష్ గౌడ్, మహేందర్ రెడ్డి, అశోక్ రెడ్డి, తుప్పరి శీను, మహేష్ గౌడ్, నరేందర్ రెడ్డి, శ్రీకాంత్ రెడ్డి, మరియు ఉత్సవ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

## పండిట్ దీన్ దయాళ్ ఉపాధ్యాయ్ జయంతి సందర్భంగా ఎంపీ రఘునందన్ నివాళులు



**సిద్దిపేట, సెప్టెంబర్ 25(నీలగిరి ఎక్స్ ప్రెస్):**
పండిట్ దీన్ దయాళ్ ఉపాధ్యాయ్ జయంతిని పురస్కరించుకుని బీజేపీ జిల్లా కార్యాలయంలో ఘనంగా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మెదక్ పార్లమెంట్ సభ్యుడు మాధవనేని రఘునందన్ రావు ఉపాధ్యాయ్ చిత్రపటానికి పూలమాల వేసి, వినమ్రంగా నివాళులు అర్పించారు.
**ఈ సందర్భంగా రఘునందన్ రావు మాట్లాడుతూ –**
"అంత్యోదయ సిద్ధాంతం దేశానికి మార్గదర్శకంగా నిలిచింది. సమాజంలో చివరి వ్యక్తి అభివృద్ధి కోసం ఉపాధ్యాయ్ చూపిన మార్గం ప్రతి నాయకుడికి స్ఫూర్తిదాయకం. ఆయన జీవితం, ఆలోచనలు, సేవా దృక్పథం యువతకు ఆదర్శంగా నిలవాలి" అని పేర్కొన్నారు.
కార్యక్రమంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు, ప్రజాప్రతినిధులు పాల్గొని ఉపాధ్యాయ్ సేవలను స్మరించుకున్నారు.

## శరన్నవరాత్రుల సందర్భంగా వర్గల్ సరస్వతి ఆలయంలో ఎంపీ రఘునందన్ ప్రత్యేక పూజలు



**వర్గల్, సెప్టెంబర్ 25(నీలగిరి ఎక్స్ ప్రెస్):**
దేవి శరన్నవరాత్రుల సందర్భంగా వర్గల్ సరస్వతి అమ్మవారి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా మెదక్ పార్లమెంట్ సభ్యుడు మాధవనేని రఘునందన్ రావు అమ్మవారిని దర్శించుకుని, మంగళాశీలంగా పూజా కార్యక్రమాల్లో పాల్గొన్నారు.తదుపరి ఆలయ అభివృద్ధి పనులలో భాగంగా ఎంపీ నిధుల ద్వారా మంజూరైన సీసీ రోడ్డు నిర్మాణాన్ని ప్రారంభించారు. ఆలయ ప్రాంగణానికి మరింత సౌకర్యం కల్పించే దిశగా చేపట్టిన ఈ రోడ్డు పనులు త్వరితగతిన పూర్తి చేయనున్నట్లు తెలిపారు.కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, భక్తులు, బీజేపీ కార్యకర్తలు పాల్గొన్నారు.

# కుటుంబ విలువల పరిరక్షణకు హిందువులు ముందుండాలి

**ఆర్ఎస్ఎస్ విజయదశమి ఉత్సవంలో గుత్తికొండ రాజశేఖర్ పిలుపు**



**కరీంనగర్, సెప్టెంబర్ 25 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
హిందూ కుటుంబ విలువల పరిరక్షణకు ప్రతి ఒక్కరు నడుం బిగించాల్సిన అవసరం ఉందని ఆర్ఎస్ఎస్ జిల్లా కార్యవాహ గుత్తికొండ రాజశేఖర్ పిలుపునిచ్చారు. ఆర్ఎస్ఎస్ వందేళ్ల స్థాపన ఉత్సవాల సందర్భంగా భాగ్యనగర్ శాఖ ఆధ్వర్యంలో స్థానిక దుర్గామాత మండపంలో విజయదశమి ఉత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ప్రధాన వక్తగా హాజరైన ఆయన, 1925లో ప్రారంభమైన ఆర్ఎస్ఎస్ నేడు దేశవ్యాప్తంగా విస్తృత శాఖలతో, హిందుత్వ ఆధారిత దేశభక్తి సంస్థలతో అనేక రంగాల్లో సేవలందిస్తోందని పేర్కొన్నారు.హిందువుల ఐక్యతను శాఖల ఆధారంగా పెంపొందిస్తూ, హిందుత్వాన్ని జీవన విధానంగా నిలబెట్టి విశ్వశాంతికి మార్గం చూపుతోందని వివరించారు. సనాతన జీవన విలువలు, వివిధ మతాల సమన్వయానికి హిందుత్వం ఆధారమని తెలిపారు. దేశాభివృద్ధి కోసం హిందువులు పంచ పరివర్తన లక్ష్యంగా సామాజిక సమరసత, కుటుంబ జీవన విలువలు, స్వాధారిత జీవనం, పర్యావరణ పరిరక్షణ, పౌర విధుల పాటింపు వంటి అంశాలను తమ కుటుంబాల్లో అమలు చేయాలని సూచించారు.ఆర్ఎస్ఎస్ జన్మ శతాబ్దిలో భాగంగా రాబోయే రోజుల్లో ఇంటింటి జనజాగరణ కార్యక్రమాలు చేపట్టనున్నట్లు వెల్లడించారు. ముఖ్య అతిథిగా హాజరైన చిదుర సురేష్ మాట్లాడుతూ, ఆర్ఎస్ఎస్ వందేళ్లుగా రాజ్యాంగబద్ధంగా దేశ అభ్యున్నతికి కృషి చేస్తోందని, వ్యక్తిత్వ నిర్మాణం ద్వారా దేశ నిర్మాణం సాధ్యమవుతుందని పేర్కొన్నారు. దేశ అఖండతకు, హిందుత్వ పరిరక్షణకు ఆర్ఎస్ఎస్ చేపడుతున్న చర్యలు ప్రశంసనీయమని అన్నారు.ఈ కార్యక్రమంలో జిల్లా సంఘచాలక్ దురిశెట్టి నిరంజనాచారి, కమిటీ సభ్యులు, బస్తీ ప్రముఖులు, మాతలు, ఇతర ఆర్ఎస్ఎస్ కార్యకర్తలు పాల్గొన్నారు.

## దుర్గ మాత దేవి బ్రహ్మోత్సవాలకు సినీ నటి శ్యామల ఆహ్వానించిన బీఆర్ఎస్ పార్టీ యువ నాయకులు జెనిగల మహేష్ యాదవ్



**కడ్తాల్, సెప్టెంబర్ 25 ( నీలగిరి ఎక్స్ ప్రెస్ )**
రంగారెడ్డి జిల్లా కడ్తాల్ మండలం ఎక్వాయిపల్లి గ్రామంలో యువ నాయకులు మహేష్ యాదవ్ ఆధ్వర్యంలో దుర్గామాత తల్లి బ్రహ్మోత్సవాలు అంగరంగ వైభవంగా నిర్వహిస్తున్నారు. గురువారం హైదరాబాదులో సినీనటి శ్యామలని గ్రామానికి మరియు బ్రహ్మోత్సవాలకు ఆహ్వానించడం జరిగిందని ఈ సందర్భంగా తెలిపారు. ఈ కార్యక్రమంలో శేఖర్ యాదవ్, సురేష్, వెంకీ మామ, బన్నీ, పాల్గొన్నారు.

## వెంచర్లలో వైర్ల చోరీ నిందితుల అరెస్ట్



**కడ్తాల్, సెప్టెంబర్ 25 ( నీలగిరి ఎక్స్ ప్రెస్ )**
: వెంచర్లలో ఇటీవల విద్యుత్ వైర్ల చోరీని కడ్తాల్ పోలీసులు ఛేధించారు. గురువారం సీఐ గంగాధర్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. నిందితులు సత్యం చౌబె, ( ఉత్తర ప్రదేశ్ ), ధీరజ్ కుమార్ ( ఉత్తర ప్రదేశ్ ), జన రోహన్, ( ఒడిశా స్టేట్ ), శామ్ బాబు రామ్ ( బీహార్ స్టేట్ ) వీరు బతుకుదెరువు కోసం హైదరాబాద్ నగరానికి వచ్చి వివిధ పనులు చేస్తూ ఉపాధి పొందుతున్నారు. ఈజీగా డబ్బులు సంపాదించాలనే ఆలోచనతో వీరు గ్రూపు గా ఏర్పడి దొంగతనాలకు పాల్పడాలని నిర్ణయించుకొని కర్కళ్ పహాడ్ నైపుణ్య వెంచర్, ముచ్చర్ల గేటు సమీపంలో ఎస్వీ హై సిటీ వెంచర్, కడ్తాల్ టోల్ ప్లాజా దగ్గరలో ఓ వెంచర్, చెన్నంపల్లిలో వెంచర్ లో గల విద్యుత్ స్తంభాలకు ఉన్న అల్యూమినియం వైర్లను కట్ చెసి చోరీ చేశారు. ఆయా వెంచర్ నిర్వాహకులు పోలీసులుకు పిర్యాదు చేయడంతో పోలిసులు సీసీ కెమెరాల సహాయంతో నిందులను గుర్తించి అరెస్ట్ చేసి కేసు నమోదు చేసి కారు స్వాధీనం చేసుకున్నట్లు పోలీసులు తెలిపారు.

## గవ్వలతో అమ్మవారికి అలంకరణ

### నవరాత్రి ఉత్సవాల్లో ప్రకాశం గంజిలో ప్రత్యేక ఆకర్షణ



**కరీంనగర్, సెప్టెంబర్ 25(నీలగిరి ఎక్స్ ప్రెస్):**
నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా ప్రకాశం గంజిలో రాచర్ల రమేష్ -శ్రీదేవి కుటుంబ సభ్యులు నిర్వహిస్తున్న అమ్మవారి పూజలు భక్తులను ఆకట్టుకుంటున్నాయి. నాల్గవ రోజు అమ్మవారిని గవ్వలతో అలంకరించడం విశేషంగా నిలిచింది. నవరాత్రి శోభను మరింత పెంచిన ఈ అలంకరణ భక్తులను మంత్రముగ్ధులను చేసింది.ఉదయం నుంచీ రాత్రివరకు అసంఖ్యాకంగా భక్తులు అమ్మవారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు. ఈ సంవత్సరం దుర్గాదేవి నవరాత్రులు ప్రత్యేకంగా నిర్వహిస్తున్నారని పలువురు భక్తులు హర్షం వ్యక్తం చేశారు.నిత్యం దేవి సేవలో ఉండడం తమకు ఆధ్యాత్మిక ఆనందాన్ని కలిగిస్తోందని రాచర్ల కుటుంబ సభ్యులు తెలిపారు. ఉత్సవాల్లో భాగంగా ప్రతిరోజూ ప్రత్యేక అలంకరణలు, పూజా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు పేర్కొన్నారు.

## కాత్యాయనీ దేవి రూపంలో అమ్మవారి దర్శనం



**ఎలిగేడు, సెప్టెంబర్ 25(నీలగిరి ఎక్స్ ప్రెస్)**
ఎలిగేడు మండల కేంద్రంలోని భవాని రామలింగేశ్వర ఆలయంలో దుర్గామాత గురువారం కాత్యాయనీ దేవి రూపంలో భక్తులకు దర్శనమిచ్చారు. ప్రధాన అర్చకులు సేగ్యామ దయాకర్ శర్మ నేతృత్వంలో పూజారి గజవెల్లి విశ్వనాథ్ ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం తీర్థ ప్రసాద వితరణ జరిగింది. చిన్నారులు, మహిళలు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## రైతుల పక్షాన నిలుస్తాం: జంగిలి నిరంజన్

**-ఆర్ఆర్ఆర్ కొత్త అలైన్‌మెంట్‌పై తీవ్ర అభ్యంతరం**



**వెల్దండ, సెప్టెంబర్ 25(నీలగిరి ఎక్స్ ప్రెస్):**
ఆర్ఆర్ఆర్ ప్రాజెక్టులో పాత అలైన్‌మెంట్‌ను రద్దు చేసి కొత్త మార్గాన్ని తీసుకురావడం వల్ల ఆమనగల్, తలకొండపల్లి, కేశంపేట్, మాడుగుల మండలాల్లోని చిన్న, సన్నకారు రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు, మాజీ ఉపసర్పంచ్ జంగిలి నిరంజన్ ఆవేదన వ్యక్తం చేశారు. రైతుల ప్రయోజనాలకంటే ఇతర ప్రయోజనాల కోసం మార్పులు చేస్తున్నారని ఆరోపించారు. ప్రభుత్వం రైతుల పట్ల నిజమైన నిబద్ధత చూపితే పాత అలైన్‌మెంట్‌ను కొనసాగించాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఆందోళన చేపడతామని హెచ్చరించారు.

## పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలి




**కరీంనగర్, సెప్టెంబర్ 25 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
"భవిష్యత్ తరాలకు ఆరోగ్యకర సమాజాన్ని అందించాలంటే పర్యావరణ పరిరక్షణను జీవితంలో భాగంగా చేసుకోవాలి" అని తెలంగాణ గ్రామీణ బ్యాంక్ కరీంనగర్ రీజనల్ మేనేజర్ శ్రీమతి బాలనాగు సూచించారు. స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమంలో భాగంగా అంబేద్కర్ క్రీడా ప్రాంగణంలో 'ఏక్ దిన్ - ఏక్ గంట - ఏక్ సాత్' నినాదంతో శ్రమదానం నిర్వహించారు. మొక్కలు నాటి, ప్లాస్టిక్ వ్యర్థాలు తొలగించారు.టీజీబీ రాష్ట్రవ్యాప్తంగా 934 శాఖలతో సామాజిక సేవలోనూ చురుకుగా పాల్గొంటుందని, ఏడాదికి 100 గంటలు పర్యావరణ సేవకు కేటాయిస్తున్నామని తెలిపారు. వర్షాన్ని లెక్కచేయకుండా సిబ్బంది శ్రమదానం చేయడం విశేషం. కార్యక్రమంలో విజయ్ సింగ్, సుబ్బారావు, రమణారెడ్డి, మురళీధర స్వామి, వేణుమాధవ్, సాయి కిరణ్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## పండిత్ దీన్ దయాళ్ ఆశయాలను కొనసాగిద్దాం

### షాద్‌నగర్‌లో ఘనంగా జయంతి వేడుకలు





**షాద్‌నగర్, సెప్టెంబర్ 25(నీలగిరి ఎక్స్ ప్రెస్):**
జన్ సంఘ్ వ్యవస్థాపకులు పండిత్ దీన్ దయాళ్ ఉపాధ్యాయ జయంతిని పురస్కరించుకుని బీజేపీ స్టేట్ కౌన్సిల్ సభ్యుడు లష్కర్ నాయక్ ఆధ్వర్యంలో షాద్‌నగర్ పట్టణంలో వేడుకలు ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు పాలమూరు విష్ణువర్ధన్ రెడ్డి హాజరై, ఉపాధ్యాయ చిత్రపటానికి పూలమాలలు వేసి వినమ్రంగా నివాళులు అర్పించారు.
ఈ సందర్భంగా విష్ణువర్ధన్ రెడ్డి మాట్లాడుతూ
"పండిత్ దీన్ దయాళ్ ఆశయాలు సమాజానికి మార్గదర్శకంగా నిలుస్తాయి. చివరి వ్యక్తి అభివృద్ధి కోసం ఆయన చూపిన మార్గాన్ని కొనసాగించాల్సిన అవసరం ఉంది" అని పేర్కొన్నారు.
కార్యక్రమంలో బీజేపీ నాయకులు ఇస్నాతి శ్రీనివాస్, మోహన్ సింగ్, చేగు సుధాకర్ అప్ప, మిద్దె గణేష్, అనిల్ కుమార్ గౌడ్, రంగన్న గౌడ్, కుడుముల బాల్ రాజ్, రాజు నాయక్, ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

## పీజేఆర్ నగర్‌లో మల్టీ పర్పస్ ఫంక్షన్ హాల్ నిర్మాణానికి వేగవంతం

**కాంపౌండ్ వాల్ పనులను పరిశీలించిన కార్పొరేటర్**



**ఆల్విన్ కాలనీ,సెప్టెంబర్ 25(నీలగిరి ఎక్స్ ప్రెస్):**
124 ఆల్విన్ కాలనీ డివిజన్ పరిధిలోని పీజేఆర్ నగర్‌లో రూ.2 కోట్ల అంచనావ్యయంతో నిర్మిస్తున్న మల్టీ పర్పస్ ఫంక్షన్ హాల్ నిర్మాణ పనులు వేగంగా కొనసాగుతున్నాయి. ఈ నిర్మాణంలో భాగంగా ప్రహరీ గోడ (కాంపౌండ్ వాల్) పనులను డివిజన్ కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్ గౌడ్ జిహెచ్ఎంసి అధికారులతో కలిసి గురువారం పరిశీలించారు.
ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ
"ఫంక్షన్ హాల్ నిర్మాణంలో స్లాబు పనులు పూర్తయ్యాయి. ప్రస్తుతం జరుగుతున్న కాంపౌండ్ వాల్ నిర్మాణాన్ని నాణ్యత ప్రమాణాలతో త్వరితగతిన పూర్తి చేయాలని అధికారులకు సూచించాం. పీజేఆర్ నగర్ కాలనీ వాసుల చిరకాల కోరిక త్వరలోనే నెరవేరనుంది. అన్ని హంగులతో, సకల సౌకర్యాలతో అందరికి ఆమోదయోగ్యమైన ఫంక్షన్ హాల్‌ను నిర్మించనున్నాం" అని తెలిపారు. పేద, మధ్య తరగతి ప్రజలకు, పరిసర ప్రాంత వాసులకు ఈ ఫంక్షన్ హాల్ ఎంతో ఉపయోగపడనుందని పేర్కొన్నారు. వివాహాది శుభకార్యాలు, సమావేశాలు, సభలు, జన్మదిన వేడుకలు వంటి కార్యక్రమాలకు ఇది అనుకూలంగా ఉంటుందని వివరించారు. ఫంక్షన్ హాల్‌తో పాటు చిల్డ్రన్ పార్క్ నిర్మాణ పనులు కూడా త్వరితగతిన పూర్తి చేయాలని అధికారులకు సూచించారు.ఈ కార్యక్రమంలో సమ్మారెడ్డి, జి.రవి, షౌకత్ అలీ మున్నా, ముజీబ్, అగ్రవాసు, సిద్దయ్య, మహేష్, ఎ.ఇ. శ్రావణి, వర్క్ ఇన్స్పెక్టర్ రవి కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## నిజాంపేట్ కార్పొరేషన్‌ను ఆదర్శవంతంగా తీర్చిదిద్దుతాం

### ఎమ్మెల్యే వివేకానంద్



**నిజాంపేట్,సెప్టెంబర్ 25 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
నిజాంపేట్ మున్సిపల్ కార్యాలయంలో గురువారం అభివృద్ధి పనుల పురోగతిపై సమీక్షా సమావేశం నిర్వహించారు. కార్పొరేషన్ పరిధిలోని డివిజన్లు, కాలనీల్లో జరుగుతున్న మంజీరా నీటి సరఫరా, బిల్లుల నిర్వహణ, వీధి దీపాల నిర్వహణ, సీసీ రోడ్లు, భూగర్భ డ్రైనేజ్, చెరువుల అభివృద్ధి, వర్షపు నీటి నిలిపివేత, బాచుపల్లి ఫ్లై ఓవర్ పనులపై ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను ఎమ్మెల్యే కె.పి. వివేకానంద్ అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, గత పదకొండేళ్లలో కోట్లాది రూపాయల నిధులతో అన్ని డివిజన్లు, కాలనీల్లో మౌలిక వసతుల కల్పనకు చర్యలు చేపట్టామని, రానున్న రోజుల్లో కూడా అభివృద్ధి పనులను వేగవంతం చేస్తామని తెలిపారు. బాచుపల్లి ఫ్లై ఓవర్ పనులను త్వరితగతిన పూర్తి చేసి ట్రాఫిక్ సమస్యను పరిష్కరించేలా చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. టెండర్లు పూర్తయిన పనులను వెంటనే ప్రారంభించి నాణ్యత ప్రమాణాలతో పూర్తి చేయాలని అధికారులకు సూచించారు. చెరువుల సుందరీకరణలో భాగంగా నిజాంపేట్ కార్పొరేషన్ పరిధిలోని ఎనిమిది చెరువులకు రూ.22 కోట్లు, ఐదు పార్కుల అభివృద్ధికి రూ.10 కోట్ల నిధులు కేటాయించామని, ఈ పనులను త్వరితగతిన ప్రారంభించాలని తెలిపారు. కార్పొరేషన్ పరిధిలోని స్మశాన వాటికల అభివృద్ధికి ప్రత్యేక ప్రణాళికలు రూపొందించి అవసరమైన సౌకర్యాలు కల్పించనున్నట్లు వెల్లడించారు. పెరుగుతున్న దోమల వ్యాప్తిని నియంత్రించేందుకు అన్ని డివిజన్లలో ఫాగింగ్ కార్యక్రమాలను నిరంతరంగా నిర్వహించాలని సూచించారు.ఈ సమావేశంలో మున్సిపల్ కమిషనర్ సాబేర్ అలీ, ఎమ్మార్వో పూల్ సింగ్, వివిధ విభాగాల అధికారులు పాల్గొన్నారు.

# స్థానిక ఎన్నికలకు సిద్ధం కండి ప్రభుత్వ పథకాలు ప్రజల్లోకి తీసుకెళ్లండి మునుగోడు శాసనసభ్యులు :రాజగోపాల్ రెడ్డి



**మునుగోడు ,సెప్టెంబర్ 25 (నీలగిరి ఎక్స్ ప్రెస్):** రిజర్వేషన్లు,స్థానిక సంస్థల ఎన్నికల్లో అనుసరించాల్సిన వ్యూహాలపై గురువారం ముఖ్య నాయకులతో తన క్యాంపు కార్యాలయంలో సమావేశం ఏర్పాటుచేసిన కోమటిరెడ్డి రాజ్ గోపాల్ రెడ్డి కార్యక్రమాన్ని ఉద్దేశి మాట్లాడుతూ ప్రజా ప్రభుత్వం ప్రవేశపెట్టి ప్రజలకు చేరువైన సన్నబియ్యం పంపిణి,మహిళలకు బస్సుల్లో ఉచిత ప్రయాణం,200 యూనిట్ల ఉచిత కరెంటు,రేషన్ కార్డుల పంపిణి,ఇందిరమ్మ ఇల్లు ల మంజూరు లాంటి పథకాల గురించి ప్రజల్లోకి పాజిటివ్ గా తీసుకెళ్లాలని సూచించారు..ఇచ్చిన హామీలను ఒక్కొక్కటిగా నెరవేరుస్తున్నప్పటికి కొన్ని పూర్తిగా నెరవేర్చకపోవడానికి ఉన్న ఇబ్బందులను ప్రజలకు అర్థమయ్యే విదంగా వివరించాలని అన్నారు..ఓ వైపు ఛిద్రం చేసిన ఆర్థిక వ్యవస్థను చక్కదిద్దుతూనే గత ప్రభుత్వం ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలు కొనసాగిస్తున్నామని,మరో వైపు ఇచ్చిన హామీలను నెరవేరుస్తూ అభివృద్ధి పనులు చేస్తున్న తీరును ప్రజల్లోకి తీసుకెళ్లాలన్నారు. గత పాలకులు చేసిన పాపాల కే ఇపుడు ఇబ్బంది పడుతున్నామని,ప్రాజెక్టుల పేరు మీద చేసిన అప్పులకు ఈ ప్రభుత్వం వడ్డీలు కడుతూ నే వ్యవస్థను గాడిలో పెడుతున్న తీరును కూడా ప్రజల్లోకి తీసుకెళ్లాలని సూచించారు... ఇందిరమ్మ ఇల్లు ల మంజూరులో నెలకొన్న ఇబ్బందులు అధిగమించడానికి నిబంధనల సడలింపు పై ప్రభుత్వంతో మాట్లాడి నిజమైన నిరుపేద అర్హులకు న్యాయం జరిగేలా ప్రయత్నం చేస్తానని అన్నారు.. గ్రామ స్థాయి లో నెలకొన్న సమస్యలు పరిష్కరించడానికి అనుసరించాల్సిన అంశాల పై కూలంకషంగా చర్చించారు..ఈ సమావేశంలో వివిధ మండలాలకు చెందిన ముఖ్య నాయకులు పాల్గొన్నారు..

# పండుగకు ఊరెళ్తున్నారా..? జాగ్రత్తలు తప్పనిసరి




**బాలానగర్, సెప్టెంబర్ 25(నీలగిరి ఎక్స్ ప్రెస్):** దసరా, బతుకమ్మ పండుగల నేపథ్యంలో ఊళ్లకు వెళ్లే వారు అప్రమత్తంగా ఉండాలని బాలానగర్ ఏసీపీ నరేష్ రెడ్డి సూచించారు. చోరీల నియంత్రణకు గస్తీ, సీసీ కెమెరాలు, హెూమ్ సెక్యూరిటీ చర్యలు చేపట్టామని తెలిపారు. ఇంటికి తాళం వేసే ముందు పక్కింటివారికి సమాచారం ఇవ్వడం, విలువైన వస్తువులను బ్యాంకు లాకర్లలో భద్రపరచడం, ఇంట్లో లైట్లు, టైమర్ లైట్లు అమర్చడం వంటి జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. కొత్త వ్యక్తుల కదలికలపై 100 డయల్ లేదా 9490617444 కు సమాచారం ఇవ్వాలని కోరారు.

# పండిట్ దీనదయాళ్ జయంతి సందర్భంగా చెట్ల నాటిన నేతలు

**నర్సంపల్లిలో బీజేపీ ఆధ్వర్యంలో పర్యావరణ సేవా కార్యక్రమం**



**మాడుగుల, సెప్టెంబర్ 25 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** జన్ సంఘ్ వ్యవస్థాపకుడు, భారతీయ జనతా పార్టీ హైందవ రాష్ట్రం సిద్ధాంతకర్త పండిట్ దీనదయాళ్ ఉపాధ్యాయ్ జయంతిని పురస్కరించుకుని మాడుగుల మండలంలోని నర్సంపల్లి గ్రామంలో బీజేపీ ఆధ్వర్యంలో పర్యావరణ సేవా కార్యక్రమం నిర్వహించారు. రాష్ట్ర బీజేపీ పార్టీ ఆదేశాల మేరకు మండల అధ్యక్షుడు నల్లకాసుల పెద్దయ్య యాదవ్ ఆధ్వర్యంలో మహిళలు, గ్రామస్థులతో కలిసి చెట్లను నాటారు.పండిట్ దీనదయాళ్ ఉపాధ్యాయ్ ఆశయాలను స్మరించుకుంటూ, గ్రామాభివృద్ధి, పర్యావరణ పరిరక్షణకు ప్రాధాన్యతనిస్తూ చేపట్టిన ఈ కార్యక్రమం గ్రామ ప్రజలలో చైతన్యం నింపింది. భవిష్యత్ తరాలకు ఆరోగ్యకరమైన వాతావరణాన్ని అందించాలన్న సంకల్పంతో నిర్వహించిన ఈ కార్యక్రమం ప్రశంసలు పొందింది.

# పండిత దీన్ దయాల్ జయంతి సందర్భంగా ఘన నివాళులు



**మహేశ్వరం, సెప్టెంబర్ 25 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** రంగారెడ్డి జిల్లా మహేశ్వరం నియోజకవర్గంలోని మండల కేంద్రంలో పండిత దీన్ దయాల్ ఉపాధ్యాయ్ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. సేవా పక్వాడ్ మండల కన్వీనర్ అయిల్ల యాదయ్య గౌడ్ ఆధ్వర్యంలో ఉపాధ్యాయ్ చిత్రపటానికి పూలమాలలు వేసి, వినమ్రంగా నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన బీజేపీ రంగారెడ్డి జిల్లా సేవా పక్వాడ్ కన్వీనర్ కే అనంతయ్య గౌడ్ మాట్లాడుతూ, "ఏకాత్మతా మానవతా, అంత్యోదయ సిద్ధాంతాలను విరివిగా ప్రచారం చేసిన మహనీయుడు పండిత దీన్ దయాల్ ఉపాధ్యాయ్. ఆయన ఆశయాలను సాధించే దిశగా ప్రతి కార్యకర్త కృషి చేయాలి" అని దిశానిర్దేశం చేశారు. జన్మదినాన్ని పురస్కరించుకుని కార్యకర్తలందరూ మొక్కలు నాటి పర్యావరణ పరిరక్షణకు తమ వంతు సేవ చేయాలని సూచించారు.కార్యక్రమంలో మహేశ్వరం మండల అధ్యక్షుడు తెల్గమల్ల యాదేశ్, బీజేపీ కిసాన్ మోర్చా ప్రధాన కార్యదర్శి పోతర్ల సుదర్శన్ యాదవ్, డబిల్ గూడ సర్పంచ్ బుగ్గని శంకర్, బీజేవైఎం మండల అధ్యక్షుడు వనంపల్లి శ్రవణ్, జిల్లా నాయకులు బొర్రా సాయిలు, మాధవ్, గుత్తి రాజు, ప్రకాష్, మంత్రి కర్ణాకర్ బాబు తదితరులు పాల్గొన్నారు. బీజేపీ మండల అధ్యక్షుడు యాదేశ్ మాట్లాడుతూ, "పండిత దీన్ దయాల్ ఆశయాలను ప్రజల్లోకి తీసుకెళ్లే కార్యక్రమాల ద్వారా పార్టీ బలోపేతం అవుతుంది. ఈ ఉత్సవాలు కార్యకర్తల్లో కొత్త ఉత్సాహాన్ని నింపుతున్నాయి" అని పేర్కొన్నారు.

# రెడ్డి జాగృతి ఆధ్వర్యంలో ఘనంగా బతుకమ్మ సంబరాలు



**నల్లగొండ ,సెప్టెంబర్ 25 (నీలగిరి ఎక్స్ ప్రెస్)**

నల్గొండ జిల్లాలో బతుకమ్మ సంబరాలు ఊపందుకున్నాయి. నాల్గవరోజు ఎన్జీ కళాశాల మైదానంలో రెడ్డి జాగృతి ఆధ్వర్యంలో బతుకమ్మ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళలు పెద్ద ఎత్తున బతుకమ్మ ను తీసుకువచ్చిరు మొదటగా పురోహితులు పూజలు నిర్వహించారు అనంతరం మహిళలు ఆడి పాడారు.ఈ బతుకమ్మ వేడుకలను ప్రజలు పెద్ద ఎత్తున తిలకించారు. పలు కాలనీల నుండి తీసుకువచ్చిన బతుకమ్మలు ప్రజలను ఎంతగానో ఆకర్షించాయి ఉత్తమ బతుకమ్మ లకు రెడ్డి జాగృతి ఆధ్వర్యంలో బహుమతులు ప్రధానం చేసినట్లు జాగృతి కమిటీ సభ్యులు తెలిపారు.

# తెలంగాణ సంస్కృతి సంప్రదాయాలకు ప్రతీక బతుకమ్మ పండుగ

**- జిల్లా కలెక్టర్ , హనుమంతరావు**



**యాదాద్రి,సెప్టెంబర్ 25 (నీలగిరి ఎక్స్ ప్రెస్)**

తెలంగాణ మహిళల సంస్కృతి సంప్రదాయాలకు ప్రతీక బతుకమ్మ పండుగ అని జిల్లా కలెక్టర్ హనుమంతరావు అన్నారు. గురువారం కలెక్టరేట్ లోని అన్ని శాఖల ఆధ్వర్యంలో ఐదవ రోజు బతుకమ్మ పండుగ సంబరాలు కలెక్టరేట్లో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా తెలంగాణ మహిళల సంస్కృతి సాంప్రదాయాలకు బతుకమ్మ పండుగ ప్రతీక గా నిలుస్తుంది అని జిల్లా కలెక్టర్ అన్నారు. తెలంగాణ మహిళల ఆత్మీయత, ఆధ్యాత్మికత, సంస్కృతి సాంప్రదాయాలకు బతుకమ్మ పండుగ ప్రతీక గా నిలుస్తుంది అన్నారు. ప్రకృతిని దైవంగా పూజించి పండుగగా బతుకమ్మ పండుగ అన్నారు. ఇలాంటి పండుగలను నిర్వహించడం ద్వారా మన సంస్కృతి సాంప్రదాయాలను భావితరాలకు తెలుపవచ్చు అన్నారు. భావి తరాల కు చెందిన పిల్లలకు సంస్కృతి , సాంప్రదాయాలతో పాటు విలువలను కూడా తెలపడం ముఖ్యమన్నారు. మహిళా ఉద్యోగులు కలిసి బతుకమ్మ ఆడి , పాటలు పాడి బతుకమ్మ పండుగ సంబరాలలో ఉత్సాహంగా పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో మహిళ సిబ్బంది పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. బతుకమ్మ ఆటపాటలతో కలెక్టరేట్ ప్రాంగణం సందడిగా మారింది. ఈ కార్యక్రమంలో రెవిన్యూఅదనపు కలెక్టర్ వీరా రెడ్డి, జెడ్పి సీఈవో శోభారాణి, జిల్లా రెవెన్యూ అధికారి జయమ్మ, కలెక్టరేట్ మహిళా సిబ్బంది పాల్గొన్నారు.

# డబుల్ బెడ్ రూమ్ ఇండ్ల కోసం పోరాటానికి కేసులు

**- కోర్టుకు హాజరైన బీజేపీ నేత శ్రీరాములు**




**బాలాపూర్, సెప్టెంబర్ 25(నీలగిరి ఎక్స్ ప్రెస్):** మహేశ్వరం నియోజకవర్గంలో స్థానికులకే డబుల్ బెడ్ రూమ్ ఇండ్లు కేటాయించాలని గతంలో బీజేపీ నేత అందెల శ్రీరాములు పోరాటం చేసిన నేపథ్యంలో ఆయనపై అక్రమ కేసులు నమోదయ్యాయి. ఈ కేసులో పేషీ కోసం ఆయన కోర్టుకు హాజరయ్యారు. ప్రజా సమస్యలపై పోరాడినందుకే కోర్టుల చుట్టూ తిరుగుతున్నామని, స్థానికులకు ఇండ్లు కేటాయించాలని కోర్టు తీర్పు రావడం సంతోషకరమని తెలిపారు. మల్లాపూర్ ఇండ్ల నిర్మాణం త్వరగా పూర్తి చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# పండిట్ దీనదయాళ్ జయంతి సందర్భంగా స్వచ్ఛభారత్, వృక్షార్చన కార్యక్రమాలు

**రాష్ట్ర, జిల్లా నాయకుల సమక్షంలో ఘనంగా నిర్వహణ**



**మిర్యాలగూడ,సెప్టెంబర్ 25 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** జన్ సంఘ్ వ్యవస్థాపకుడు, భారతీయ తత్వవేత్త, ఆర్థికవేత్త, సామాజిక శాస్త్రవేత్త, చరిత్రకారుడు, పాత్రికేయుడు, రాజకీయ కార్యకర్త అయిన పండిట్ దీనదయాళ్ ఉపాధ్యాయ్ జయంతిని పురస్కరించుకుని స్వచ్ఛభారత్ కార్యక్రమం నిర్వహించారు. అదనంగా పర్యావరణ పరిరక్షణకు ప్రాధాన్యతనిస్తూ మొక్కలు నాటే కార్యక్రమం కూడా చేపట్టారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర నాయకుడు సాధినేని శ్రీనివాసరావు మాట్లాడుతూ, "1916 సెప్టెంబర్ 25న జన్మించి, 1968 ఫిబ్రవరి 11న పరమపదించిన దీనదయాళ్ ఉపాధ్యాయ్ భారతీయ రాజకీయ, ఆర్థిక, సామాజిక రంగాల్లో అమూల్య సేవలు అందించారు" అని పేర్కొన్నారు. ఆయన చూపిన అంత్యోదయ మార్గం దేశానికి మార్గదర్శకంగా నిలిచిందని అన్నారు. జిల్లా నాయకుడు తుమ్మలపల్లి హనుమంత్ రెడ్డి మాట్లాడుతూ, "భారతీయ జనసంగ్‌ను అత్యంత కష్టకాలంలో నిలబెట్టిన ప్రధాన నాయకుల్లో దీనదయాళ్ ఉపాధ్యాయ్ ఒకరు. హిందూ ధర్మం కోసం ప్రాణాలను సైతం లెక్కచేయకుండా అహర్నిశలు కృషి చేసిన మహానుభావుడు" అని కొనియాడారు. కార్యక్రమంలో జిల్లా నాయకులు సజ్జల నాగిరెడ్డి, బంటు సైదులు, అశోక్ రెడ్డి, వన్ టౌన్ అధ్యక్షుడు బంటు గిరి, టూ టౌన్ అధ్యక్షుడు పెద్ద బోయిన వీటి యాదవ్, కొంగర వెంకటరమణ రాజిరెడ్డి, కంచుకొమ్ముల వేణు, రవికుమార్, లక్ష్మారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# గోపాల్పేటలో కొత్త మార్కెట్ యార్డ్



**గోపాలపేట, సెప్టెంబర్ 25 ( నీలగిరి ఎక్స్ ప్రెస్ ):** వనపర్తి నియోజకవర్గంలోని గోపాలపేట, రేవల్లి, ఏదుల మండల రైతుల సౌకర్యార్థం కొత్త వ్యవసాయ మార్కెట్ యార్డ్ నిర్మాణానికి రాష్ట్ర ప్రభుత్వం అనుమతులు జారీ చేసింది. రైతుల ఇబ్బందులను దృష్టిలో పెట్టుకుని తాను చేసిన విజ్ఞప్తికి ప్రభుత్వం స్పందించిందని ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా సహకరించిన మంత్రులు దామోదర రాజనర్సింహ, వ్యవసాయ మంత్రి తుమ్మల, వాకిటి శ్రీహరి, జూపల్లి కృష్ణారావు, ఎంపీ మల్లు రవికి ఎమ్మెల్యే కృతజ్ఞతలు తెలిపారు.

# పెండింగ్ వేతనాలు చెల్లించాలి

# కలెక్టర్ కార్యాలయం ముందు ధర్నా



**యాదాద్రి,సెప్టెంబర్ 25 (నీలగిరి ఎక్స్ ప్రెస్)**
గ్రామపంచాయతీ కార్మికులకు దసరా పండుగ దగ్గరికి వచ్చిన నేటికీ బకాయి వేతనాలు చెల్లించడం లేదని గ్రామపంచాయతీ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ గణపతి రెడ్డి సిఐటియు జిల్లా అధ్యక్షులు దాసరి పాండులు అన్నారు. గురువారం సిఐటియు ఆధ్వర్యంలో గ్రామపంచాయతీ కార్మికులకు బకాయిగా ఉన్న మూడు నెలల వేతనాలు వెంటనే చెల్లించాలని సమస్యలు జిల్లా కలెక్టర్ కార్యాలయం ముందు ధర్నా నిర్వహించగా, ఆయన హాజరై,మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం గ్రామపంచాయతీ కార్మికుల పట్ల నిర్లక్ష్యంగా ఉన్నదని కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చే ముందు గ్రామపంచాయతీ కార్మికులకు ఇచ్చిన హామీలు అమలు చేయలేదని అన్నారు. గత ప్రభుత్వ హాయంలో కంటే ఎక్కువ బకాయిలుగా ఉంటుందని రెగ్యులర్ వేతనాలు చెల్లించడం లేదని అన్నారు. గ్రామపంచాయతీ కార్మికులతో వెట్టిచాకిరి చేయించుకుంటున్నదని ఏళ్ల తరబడిగా ప్రజలకు అందుబాటులో ఉంటూ చేస్తున్న గ్రామాలను శుభ్రం చేస్తే ప్రజల ఆరోగ్యాలను కాపాడుతున్న గ్రామపంచాయతీ కార్మికుల పట్ల రాష్ట్ర ప్రభుత్వం ఎంత నిర్లక్ష్యం ఉంటుందనీ రాష్ట్రంలో అన్ని ప్రభుత్వ ఉద్యోగులకు వేతనాలు సకాలంలో చెల్లించడం జరుగుతున్నదనీ అన్నారు. గ్రామపంచాయతీలో పనిచేసే గ్రామపంచాయతీ కార్మికులకు దసరా పండుగ దగ్గరికి వచ్చిన నేటికి బకాయిగా ఉన్న వేతనాలు ఎందుకు చెల్లించడం లేదని తెలిపారు. గ్రామపంచాయతీలో పనిచేస్తున్న కార్మికులు అట్టడుగు వర్గాల కులాలకు సంబంధించిన పేదవారని ఇప్పటికే చాలీచాలని వేతనాలతో ఇబ్బందులు పడతున్నారని అన్నారు. దసరా పండుగ దగ్గరికి వచ్చిన వేతనాలు చెల్లించకపోవడం వల్ల ఇబ్బందులు పడుతున్నారని వెంటనే రాష్ట్ర ప్రభుత్వం బకాయిగా ఉన్న వేతనాలు వెంటనే చెల్లించాలని అన్నారు. మల్టీపర్పస్ విధానాన్ని రద్దు చేయాలని రెగ్యులర్ గా వేతనాలు చెల్లించాలని ఇన్సూరెన్స్ సౌకర్యాలు కల్పించాలని ఆన్లైన్లో పేర్లు లేని కార్మికుల పేర్లను వెంటనే నమోదు చేయాలని వారు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామపంచాయతీ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ మహిళా రాష్ట్ర కన్వీనర్ పొట్ట యాదమ్మ, జిల్లా కార్యదర్శి గడ్డం ఈశ్వర్, నాయకులు బొల్లేపల్లి స్వామి, మంద యాదగిరి, కొండే నరసింహ, కిష్టయ్య, ఉపేందర్, భాస్కర్, రాము, శంకర్ , రమేష్, లక్ష్మి ,బుజ్జమ్మ లు పాల్గొన్నారు.

# మాజీ సీఎం కేసీఆర్ వర్ధూరులో దళితులను మోసం చేసారు

- బిఆర్ఎస్ వల్ల లభించినది కెమెరా ఫ్లాష్‌లే తప్ప మరేం కాదు
- కాంగ్రెస్ ప్రభుత్వం రాగానే ఇందిరమ్మ ఇళ్లు మంజూరు అయ్యాయి
- దళితుల కలలకు న్యాయం చేసింది కాంగ్రెస్ మాత్రమే



దళితవాడలో స్థానికుల సమస్యలు తెలుసుకుంటున్న కెసిఆర్

దళితవాడలో బస అనంతరం విలేకరుల సమావేశంలో కే...

వెన్నెలను డాక్టర్ చేద్దాం...

కూలీ నాలి చేసుకుని బతికే తమకు బిడ్డను చదివించడం కష్టమైతుందని బాలిక తల్లిదండ్రులు కెసిఆర్ దృష్టికి తేగా ఆ బాలిక వెన్నెలను పిలిచి "చదువుకుంటావా...? చదువుకుని ఏమౌతావు" అని ప్రశ్నించగా ఏడవ తరగతి చదువుతున్న ఆ బాలిక "డాక్టరేనవుతా"నని జవాబిచ్చింది.. దీనికి స్పందించిన కెసిఆర్ "నీవు చదువు ఆపవద్దు.. 25 వేలు పంపిస్తాను. వాటిని జాగ్రత్తగా ఆమె చదువుకే వాడండి.. ఇంటర్ తర్వాత తెలంగాణ భవన్‌కు వచ్చి మళ్ళీ కలవండి.. వెన్నెలను డాక్టర్ చేద్దాము"అని హామీ ఇచ్చారు. అదే విధంగా ఆదే పు వెంటయ్య కొడుకును రెసిడెన్షియల్ పాఠశాలలో వేయడానికి వారి తల్లిదండ్రులను ఒప్పించి..చేర్పించే బాధ్యతను మాజీ ఎమ్మెల్యే డాక్టర్ నగేశ్‌కు అప్పగించారు.

వెన్నెలకు హామీ ఇస్తున్న కెసిఆర్

**యాదాద్రి సెప్టెంబర్ 25 ( నీలగిరి ఎక్స్‌ప్రెస్ )**
యాదాద్రి భువనగిరి జిల్లా వర్ధూరు గ్రామంలో బిఆర్ఎస్ పార్టీ చేసిన వాగ్దానాలు గాలిలో కలిశాయి. రాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖరరావు (కేసీఆర్) 'పల్లె నిద్ర' పేరుతో గ్రామంలో రాత్రి గడిపి ప్రజలకు పెద్ద పెద్ద హామీలు ఇచ్చారు. కానీ అవి ఏ ఒక్కటీ నెరవేరలేదు. ప్రజలు, ముఖ్యంగా దళితులు, తీవ్ర నిరాశతో బిఆర్ఎస్ పై తిరుగుబాటు మంటలు రగులుతున్నారు.

**బిఆర్ఎస్ ఇచ్చిన వాగ్దానాలు అమలులో జీరో...**
వర్ధూరులో పల్లె నిద్ర సందర్భంగా కేసీఆర్ ఇచ్చిన హామీలు ఇవి దళితులకు రుణాలు, సబ్సిడీలు, చిన్న పరిశ్రమలు, ఉపాధి అవకాశాలు, బసవన్న భవనాలు, తాగునీటి సదుపాయం, కొత్త స్కూల్లు

### ఇచ్చిన హామీల్లో ఏ ఒక్కటి నిరవేర్చలేదు గత ప్రభుత్వం ?



**– మొర శ్రీనివాస్ రెడ్డి, కాంగ్రెస్ గ్రామ శాఖ అధ్యక్షులు**
"ఓటు కోసం మాత్రమే మమ్మల్ని మోసం చేశారు. అభివృద్ధి అనే మాట బిఆర్ఎస్ నిఘంటువులో లేదని తేలిపోయింది. బిఆర్ఎస్ మాటలు నమ్మి మేము మోసపోయాం. ఇకపై ఆ పార్టీకి మా ఓటు లేదు. మమ్మల్ని వాడుకున్న వారికి తగిన సమాధానం ఇస్తాం.
కేసీఆర్ చేసిన పల్లె నిద్ర కార్యక్రమం కేవలం రాజకీయ నాటకం అని వర్ధూరు ప్రజలు నమ్ముతున్నారు. హామీలు నిలబెట్టుకోని బిఆర్ఎస్ పై ప్రజలు తీవ్ర ఆగ్రహంతో ఉన్నారు."దళితుల కన్నీళ్లు తుడవని బిఆర్ఎస్ ఇక గ్రామంలో అడుగుపెట్టే హక్కు లేదు"

### మాజీ సీఎం కేసీఆర్ చేసింది పల్లె నిద్ర కాదు దొంగ నిద్ర



**– పల్లె శ్రీనివాస్, మాజీ గ్రామ శాఖ అధ్యక్షులు**
"మన కులానికి ఇచ్చిన హామీలు ఒక్కటీ నిలబెట్టుకోలేదు. కేవలం కెమెరా ముందు షోలు చేసి వెళ్లిపోయారు" అభివృద్ధి పనులు ఒక్కటీ జరగలేదు బిఆర్ఎస్ పల్లె నిద్ర వల్ల గ్రామానికి లభించినది కెమెరా ఫ్లాష్‌లే తప్ప మరేం కాదు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారం లోకి వచ్చాక ఇందిరమ్మ ఇళ్లు మంజూరు అయ్యాయి బిఆర్ఎస్ వల్ల కానీ పని కాంగ్రెస్ ప్రభుత్వం తో సాధ్యం అయింది.

# సిపిఐ జాతీయ కౌన్సిల్ సభ్యులుగా మూడోసారి ఏకగ్రీవంగా ఎం. బాల నరసింహ

**చండీగఢ్ మహాసభల్లో ఎన్నిక -జిల్లా నాయకుల నుంచి హర్షం**




**తాడూరు, సెప్టెంబర్ 25 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
పంజాబ్ రాష్ట్రం చండీగఢ్ నగరంలో సెప్టెంబర్ 21 నుండి 25 వరకు జరిగిన సిపిఐ 25వ జాతీయ మహాసభల్లో, ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా సీనియర్ కమ్యూనిస్టు నాయకుడు కామ్రేడ్ ఎం. బాల నరసింహ గారు మూడోసారి జాతీయ కౌన్సిల్ సభ్యులుగా ఏకగ్రీవంగా ఎన్నిక కావడం పట్ల సిపిఐ నాయకులు, కార్యకర్తలు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా నాగర్‌కర్నూల్ జిల్లా సిపిఐ పార్టీ, కౌన్సిల్ సభ్యులు, అనుబంధ ప్రజా సంఘాల నాయకులు మాట్లాడుతూ ၊
"బాల నరసింహ గారు ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలో బడుగు, బలహీన వర్గాల హక్కుల కోసం అలుపెరుగని పోరాటాలు నిర్వహించారు. ఎన్నో ఉద్యమాలకు నాయకత్వం వహించి, ప్రజల సమస్యలపై నిరంతరంగా ఉద్యమిస్తూ, జాతీయ స్థాయిలో పార్టీకి గొప్ప ప్రతినిధిగా నిలిచారు. ఆయన మళ్లీ ఎన్నిక కావడం ఉద్యమ నిర్మాణానికి ఎంతో ఉపయోగపడుతుంది" అని అభిప్రాయపడ్డారు. నాయకులు ఆయనకు శుభాకాంక్షలు తెలియజేస్తూ, "ఇంకా ఎన్నో ఉన్నత పదవులు అధిరోహించాలని, ప్రజా పోరాటాల్లో మరింత ముందుండాలని" ఆకాంక్షించారు.

# పండిత్ దీనదయాళ్ జయంతి సందర్భంగా లింగాలలో మొక్కల నాటింపు

**మండల బీజేపీ అధ్యక్షుడు గువ్వని నవీన్ ఆధ్వర్యంలో సేవా కార్యక్రమాలు**



**లింగాల, సెప్టెంబర్ 25 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
లింగాల మండల కేంద్రంలోని పాఠశాల ఆవరణలో పండిత్ దీనదయాళ్ ఉపాధ్యాయ జయంతిని పురస్కరించుకొని మొక్కలు నాటే కార్యక్రమాన్ని బీజేపీ లింగాల మండల శాఖ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మండల బీజేపీ అధ్యక్షుడు గువ్వని నవీన్ నేతృత్వం వహించారు. ఈ సందర్భంగా సేవా పక్షం మండల కన్వీనర్ అతినారపు సాయి సాగర్ గారు మాట్లాడుతూ ၊
"పండిత్ దీనదయాళ్ ఉపాధ్యాయ గారు జీవితాంతం దేశ సేవకు అంకితమయ్యారు. ఆయన ప్రతిపాదించిన అంత్యోదయ భావన ၊ సమాజంలో చివరి వ్యక్తి అభివృద్ధి చెందేలా చూడాలన్న తత్వం నేటికీ భారతీయ జనతా పార్టీకి మార్గదర్శకంగా నిలుస్తోంది. ఆయన ప్రవచించిన ఏకాత్మ మనవతావాదం దేశ సమైక్యతకు మూలస్తంభంగా నిలిచింది. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ గారు 'సబ్కా సాథ్, సబ్కా వికాస్, సబ్కా విశ్వాస్, సబ్కా ప్రయత్న్' అనే నినాదంతో దేశ అభివృద్ధికి కృషి చేస్తున్నారు. ఇది పండిత్ ఉపాధ్యాయ ఆలోచనలకు నిజమైన న్యాయం" అని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు మహేష్, సురేష్, శంకర్, బాలు, ప్రేమ్‌కుమార్, గౌతమ్, రాం రెడ్డి, పార్వతాలు తదితరులు పాల్గొని పర్యావరణ పరిరక్షణలో తమ భాగస్వామ్యాన్ని చాటారు. మొక్కలు నాటడం ద్వారా పర్యావరణ పరిరక్షణకు తమ కృషిని అంకితం చేశారు.

### "గుడికో జమ్మిచెట్టు" కార్యక్రమంలో ఎమ్మెల్యే సబితా పాల్గొనడం దసరా సందర్భంగా దేవాలయంలో జమ్మి చెట్టు నాటింపు



**తుక్కుగూడ, సెప్టెంబర్ 25(నీలగిరి ఎక్స్ ప్రెస్):**
మహేశ్వరం నియోజకవర్గంలోని రావిరాల –జనాయగూడ శ్రీ లక్ష్మీ నరసింహ స్వామి దేవాలయంలో "గుడికో జమ్మిచెట్టు" కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. గ్రీన్ ఇండియా ఛాలెంజ్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి గుడి ఆవరణలో జమ్మి చెట్టు మొక్కను నాటారు. దసరా రోజున జమ్మి ఆకులు పెద్దలకు ఇచ్చి ఆశీర్వాదం తీసుకోవడం మన సంప్రదాయమని, ఈ ఆచారాన్ని భవిష్యత్ తరాలకు అందించడంలో భాగంగా ఈ కార్యక్రమం ఎంతో ప్రాముఖ్యత కలిగిందని ఆమె పేర్కొన్నారు. కార్యక్రమాన్ని ప్రారంభించిన మాజీ ఎంపీ సంతోష్‌కు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, మీడియా ప్రతినిధులు, భక్తులు పాల్గొన్నారు.

### మినీ గ్రంథాలయానికి భూమి పూజ ఐనోల్ గ్రామంలో ప్రారంభించిన ఎంపీ మల్లు రవి, ఎమ్మెల్యే వంశీకృష్ణ



**అచ్చంపేట, సెప్టెంబర్ 25(నీలగిరి ఎక్స్ ప్రెస్):**
అచ్చంపేట మండలంలోని ఐనోల్ గ్రామంలో నిర్మించనున్న మినీ గ్రంథాలయ భవనానికి భూమి పూజ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఎంపీ డాక్టర్ మల్లు రవి, టీపీసీసీ ఉపాధ్యక్షుడు, ఎమ్మెల్యే డాక్టర్ చిక్కుడు వంశీకృష్ణ కలిసి పనులను ప్రారంభించారు. కార్యక్రమంలో చైర్మన్ మామిళ్ళపల్లి విష్ణువర్ధన్ రెడ్డి, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ రాజేందర్, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# ముగిసిన సీనియర్ క్రికెటర్ జీకే అనిల్‌కు అంత్యక్రియలు

**–క్రీడా వర్గాల్లో తీవ్ర విషాదం**



**మహబూబ్నగర్, సెప్టెంబర్ 25(నీలగిరి ఎక్స్ ప్రెస్):**
జిల్లాకు చెందిన సీనియర్ క్రికెటర్ జీకే అనిల్ (41) బుధవారం విజయవాడలో గుండెపోటుతో మృతి చెందారు. హైదరాబాద్‌లో ప్రైవేట్ బ్యాంకులో పనిచేస్తున్న ఆయన, విధి నిర్వహణలో విజయవాడకు వెళ్లిన సమయంలో హఠాన్మరణం జరిగింది. జాతీయ, రాష్ట్ర స్థాయి క్రికెట్ టోర్నీలకు ప్రాతినిధ్యం వహించిన అనిల్ మృతి క్రీడా వర్గాలను తీవ్రంగా కలచివేసింది. గురువారం మహబూబ్నగర్‌లో అంత్యక్రియలు నిర్వహించారు. కార్యక్రమంలో క్రీడాకారులు, అభిమానులు, ప్రజాప్రతినిధులు, బంధుమిత్రులు పాల్గొన్నారు.

# మినీ లైబ్రరీలకు శంకుస్థాపన

**– పెద్దపల్లి, రాంరెడ్డిపల్లె గ్రామాల్లో ఎంపీ మల్లు రవి, ఎమ్మెల్యే రాజేష్ రెడ్డి పర్యటన**



**తెల్కపల్లి, సెప్టెంబర్ 25(నీలగిరి ఎక్స్ ప్రెస్):**
సీఎస్ఆర్ – ఐఆర్ఎఫ్సీ నిధుల ద్వారా మంజూరైన 2 లక్షలతో నిర్మించనున్న మినీ లైబ్రరీలకు శంకుస్థాపన కార్యక్రమం తెల్కపల్లి మండలంలోని పెద్దపల్లి, రాంరెడ్డిపల్లె గ్రామాల్లో నిర్వహించారు. ఎంపీ డాక్టర్ మల్లు రవి, ఎమ్మెల్యే కూచుకుళ్ల రాజేష్ రెడ్డి, డీసీసీబీ చైర్మన్ విష్ణువర్ధన్ రెడ్డి, గ్రంథాలయ సంస్థ చైర్మన్ రాజేందర్, మార్కెట్ కమిటీ చైర్మన్ రమణ రావు పాల్గొన్నారు. గ్రామ నిరుద్యోగులు ఈ లైబ్రరీలను వినియోగించుకోవాలని ఎంపీ మల్లు రవి

# దుర్గామాత దర్శనానికి దళితులకు అడ్డగింత

**జంగమోనిపల్లిలో వివక్షతపై పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు**






**తెల్కపల్లి, సెప్టెంబర్ 25 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** నాగర్‌కర్నూల్ జిల్లా తెల్కపల్లి మండల పరిధిలోని జంగమోనిపల్లి గ్రామంలో దేవీ నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా దుర్గామాతను దర్శించేందుకు వెళ్లిన దళితులకు వేరే కులస్తులు అడ్డగింత కలిగించిన ఘటన కలకలం రేపుతోంది. ఈ ఘటనపై బాధితులు తెల్కపల్లి పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశారు.

గ్రామస్థులు తెలిపిన వివరాల ప్రకారం నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా ఆలయంలో నిర్వహించిన దుర్గామాత దర్శన కార్యక్రమానికి దళితులు హాజరయ్యేందుకు ప్రయత్నించగా, కొంతమంది వేరే కులస్తులు "మీకు ప్రవేశం లేదు" అంటూ అడ్డగించారు. ఇది కుల వివక్షతకు నిదర్శనంగా భావించిన దళితులు, తమ పట్ల జరిగిన అన్యాయాన్ని పోలీసులకు వివరించారు.

స్వాతంత్రం వచ్చి 78 ఏళ్లు గడుస్తున్నా, సమాజంలో కుల వివక్షత పూర్తిగా అంతరించలేదు. "కుల మతాలకు తావు లేకుండా అందరం ఐక్యంగా ఉండాలి" అనే సందేశాన్ని స్వాతంత్ర దినోత్సవ వేడుకల్లో పలికినప్పటికీ, ఆచరణలో మాత్రం విభేదాలు కొనసాగుతూనే ఉన్నాయి. ఆలయాల్లో, పండుగల సందర్భాల్లో తక్కువ కులాలకు చెందినవారిని అడ్డగించడం వంటి ఘటనలు తరచూ వెలుగులోకి వస్తున్నాయి. కుల వివక్షత నిర్మూలనకు కఠిన చట్టాలు అమలులో ఉన్నప్పటికీ, కొన్ని ప్రాంతాల్లో కుల జాడ్యం ఇంకా కొనసాగుతుండటం ఆందోళన కలిగిస్తోంది. ఈ ఘటనపై పోలీసులు విచారణ ప్రారంభించారు.

## పురాతన ఆలయాలను సందర్శించిన ఎంపీ మల్లు రవి, ఎమ్మెల్యే వంశీకృష్ణ

**ఈరాట్వన్‌పల్లిలో ఆలయ అభివృద్ధిపై గ్రామస్తుల వినతి**





**అచ్చంపేట, సెప్టెంబర్ 25 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** అచ్చంపేట నియోజకవర్గ పర్యటనలో భాగంగా నాగర్‌కర్నూల్ ఎంపీ డాక్టర్ మల్లు రవి గారు, ఎమ్మెల్యే డాక్టర్ చిక్కుడు వంశీకృష్ణ గారు ఉప్పునుంతల మండలంలోని ఈరాట్వన్‌పల్లి గ్రామాన్ని సందర్శించారు. గ్రామంలో ఉన్న పురాతన రామాలయం మరియు శివాలయాన్ని వారు దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అలయ ప్రాంగణంలో ఆలయ సిబ్బంది పూలమాలలతో నేతలకు ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా గ్రామస్తులు, ఆలయ అభివృద్ధికి ఎండోమెంట్ నిధులు కేటాయించాలని ఎంపీ, ఎమ్మెల్యేలకు వినతి చేశారు. ఆలయ పునరుద్ధరణ, మౌలిక సదుపాయాల కల్పనపై వారు తమ అభిప్రాయాలను వ్యక్తపరిచారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు కట్టా అనంతరెడ్డి, యువజన కాంగ్రెస్ మండల ఇంచార్జ్ అంతటి శేఖర్ గౌడ్, యువజన కాంగ్రెస్ మండల అధ్యక్షులు మెడమోని భాస్కర్, శ్రీనివాస్ రెడ్డి, మాజీ సర్పంచ్ లింగమయ్య, శంకర్, రామచంద్రయ్య, శ్రీను రాజు, అంజి రాములు, నరసింహ గౌడ్, లచ్చయ్య, తిరుపతయ్య, శేఖర్, గ్రామపంచాయతీ కార్యదర్శి శేఖర్, ఫీల్డ్ అసిస్టెంట్ రాము, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

## శాంతంగా జరుపుకుందాం శరన్నవరాత్రులు

**- ఎమ్మెల్యే నారాయణరెడ్డి**

**-కడ్తాల్‌లో దేవి పూజల్లో పాల్గొన్న ముఖ్యఅతిథి**



**కడ్తాల్, సెప్టెంబర్ 25 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** జిల్లా వ్యాప్తంగా శరన్నవరాత్రి ఉత్సవాలు భక్తిశ్రద్ధలతో కొనసాగుతున్నాయి. ఎల్బీనగర్, మహేశ్వరం, ఆమనగల్, షాద్‌నగర్, శేరిలింగంపల్లి, ఇబ్రహీంపట్నం నియోజకవర్గాల్లో భక్తులు ఏర్పాటు చేసిన అమ్మవారి మండపాల్లో ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నారు. కడ్తాల్ మండలంలోని ఎక్కువైపెల్లి గ్రామంలో ఫ్రెండ్స్ యూత్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న శరన్నవరాత్రి ఉత్సవాల్లో ఎమ్మెల్యే కాశిరెడ్డి నారాయణరెడ్డి ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. అమ్మవారి సన్నిధిలో ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం, ఆలయ నిర్వాహకులు శాలువాతో సత్కరించి తీర్థప్రసాదాలు అందజేశారు. అనంతరం ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమాన్ని ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, "తెలంగాణలో దసరా అత్యంత వైభవంగా జరుపుకునే పండుగ. ప్రజలు శాంతమైన వాతావరణంలో, భక్తిశ్రద్ధలతో పండుగను జరుపుకోవాలి" అని పిలుపునిచ్చారు.

# అంగన్వాడీ టీచర్లకు యూనిఫాం పంపిణీ

**హుస్నాబాద్ మార్కెట్ యార్డులో మంత్రి పొన్నం ప్రభాకర్ చేతుల మీదుగా పంపిణీ**



**హుస్నాబాద్, సెప్టెంబర్ 25 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** హుస్నాబాద్ నియోజకవర్గంలోని మార్కెట్ యార్డులో అంగన్వాడీ టీచర్లు, హెల్పర్లకు యూనిఫాం చీరలు పంపిణీ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి రాష్ట్ర మంత్రి పొన్నం ప్రభాకర్ గారు ముఖ్య అతిథిగా హాజరై, మహిళలకు బతుకమ్మ, దసరా పండుగ శుభాకాంక్షలు తెలిపారు.

ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ "తల్లి –బిడ్డ ఆరోగ్యంగా ఉండాలంటే అంగన్వాడీ టీచర్ల పాత్ర అత్యంత కీలకం. ప్రభుత్వ పక్షాన మీకు ఇచ్చిన బాధ్యతను నిబద్ధతతో నిర్వర్తిస్తే, ఆరోగ్యవంతమైన తల్లులు, బలమైన పిల్లలు సమాజానికి అందుతారు. ఐసీడీఎస్ కేంద్రం మా ఇంట్లో ఉండేది, అందువల్ల అంగన్వాడీ కార్యకలాపాలపై నాకు పూర్తి అవగాహన ఉంది" అని తెలిపారు.'గర్భిణులను గుర్తించి, పౌష్టిక ఆహారం, గుడ్లు, మందులు సమయానికి అందించాలి. ఆరు సంవత్సరాల వయస్సు వరకు పిల్లల పోషణపై మీ వద్ద ఉన్న క్యాలెండర్ ప్రకారం చర్యలు తీసుకోవాలి. రోగనిరోధక శక్తి పెంపొందించేలా పని చేయాలి. మీ సమస్యలను ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్తాను. గ్రామీణ ప్రాంతాల్లో ఆరోగ్యవంతమైన మహిళలకు మంచి జీవితం అందించేలా కృషి చేయాలి" అని మంత్రి పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సిద్దిపేట జిల్లా కలెక్టర్ హైమవతి, అడిషనల్ కలెక్టర్ గరిమ అగర్వాల్, గ్రంథాలయ సంస్థ చైర్మన్ లింగమూర్తి, హుస్నాబాద్ మార్కెట్ కమిటీ చైర్మన్ తిరుపతి రెడ్డి, ఆర్డీవో రామ్మూర్తి, మున్సిపల్ కమిషనర్ మల్లికార్జున్ తదితరులు పాల్గొన్నారు. అంతేకాక, ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించేందుకు స్టీల్ బ్యాంక్ ద్వారా స్టీల్ పాత్రలు పంపిణీ చేసినట్లు మంత్రి తెలిపారు.

## కరీంనగర్ పోలీస్ కమీషనరేట్‌కు నూతన లోగో ఆవిష్కరణ

**నేర సమీక్షలో కీలక సూచనలు చేసిన సీపీ గౌష్ ఆలం**




**కరీంనగర్, సెప్టెంబర్ 25 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)** కరీంనగర్ పోలీస్ కమీషనరేట్ కేంద్రంలో నెలవారీ నేర సమీక్ష సమావేశం నిర్వహించిన సీపీ గౌష్ ఆలం ఐపీఎస్, ఈ సందర్భంగా కమీషనరేట్‌కు ప్రత్యేకంగా రూపొందించిన నూతన లోగోను ఆవిష్కరించారు. హైదరాబాద్, సైబరాబాద్, రాచకొండ తర్వాత సొంత లోగో కలిగిన నాలుగో కమీషనరేట్‌గా కరీంనగర్ నిలిచిందని తెలిపారు. సమావేశంలో పిటిషన్ పరిష్కారం, స్టేషన్ పరిశుభ్రత, రికార్డు నిర్వహణ, రౌడీ షీటర్లపై నిఘా, మాదక ద్రవ్యాల నిర్మూలన, సైబర్ నేరాలపై అవగాహన, ట్రాఫిక్ నియంత్రణ, కమ్యూనిటీ పోలీసింగ్ తదితర అంశాలపై అధికారులకు సూచనలు చేశారు. సమావేశంలో అడిషనల్ డీసీపీలు వెంకటరమణ, భీంరావు, ఏసీపీలు, ఇన్‌స్పెక్టర్లు పాల్గొన్నారు.

## రాయపట్నం, దొనూర్ గ్రామాల్లో మంత్రి అడ్లూరి శంకుస్థాపన, ప్రారంభ కార్యక్రమాలు

**అంగన్వాడీ, సంఘ భవనాలు, పంచాయతీ కార్యాలయం, సీసీ రోడ్లకు శ్రీకారం**



**ధర్మపురి, సెప్టెంబర్ 25 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)** ధర్మపురి మండలంలోని రాయపట్నం గ్రామంలో రూ.12 లక్షల వ్యయంతో నిర్మించబోయే అంగన్వాడీ భవనానికి, రూ.5 లక్షల అంబేద్కర్ సంఘ భవన మిగులు పనులకు రాష్ట్ర సంక్షేమశాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ శంకుస్థాపన చేశారు. అదే గ్రామంలో రూ.1.5 లక్షలతో ఎలక్ట్రిక్ లైట్లు ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. అనంతరం దొనూర్ గ్రామంలో రూ.16 లక్షల వ్యయంతో నిర్మించిన గ్రామ పంచాయతీ భవనాన్ని మంత్రి ప్రారంభించారు. అదే గ్రామంలో రూ.10 లక్షలతో చేపట్టనున్న సీసీ రోడ్ల నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. ప్రభుత్వం గ్రామ ప్రజలకు మౌలిక సదుపాయాలు కల్పించడమే లక్ష్యంగా పనిచేస్తోందని, ప్రతి ఇంటికీ అభివృద్ధి ఫలాలు చేరేలా చర్యలు తీసుకుంటామని మంత్రి పేర్కొన్నారు. కార్యక్రమంలో మండల కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## రుణ లక్ష్య సాధనకు బ్యాంకర్లు కృషి చేయాలి

**లబ్ధిదారులకు చెక్కులు పంపిణీ చేసిన ఎమ్మెల్యే జి.ఎస్.ఆర్**



**భూపాలపల్లి, సెప్టెంబర్ 25 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)** ప్రాధాన్యతా రంగాలకు అధికంగా రుణాలు అందించాలని, రైతులకు పంట రుణాలపై దృష్టి పెట్టాలని ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు సూచించారు. కలెక్టరేట్‌లో జరిగిన జిల్లా స్థాయి బ్యాంకర్ల సమీక్ష సమావేశంలో ఆయన పాల్గొన్నారు. రూ.1221 కోట్ల పంట రుణ లక్ష్యంలో ఇప్పటివరకు రూ.136 కోట్లే సాధించారని బ్యాంకర్లు తెలిపారు. రుణాల ప్రక్రియ వేగవంతం చేయాలని, గ్రామస్థాయిలో అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. అదే సందర్భంగా రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన వరికోల్‌పల్లి గ్రామానికి చెందిన శ్రీరాముల విష్ణు వర్ధన్, పాల రజిత కుటుంబాలకు ఒక్కొక్కరికి రూ.1 లక్ష చొప్పున చెక్కులు అందజేశారు. "ప్రభుత్వం తరఫున ఎల్లవేళలా అండగా ఉంటాను" అని ఎమ్మెల్యే పేర్కొన్నారు.

## ఘనంగా పండిత్ దీన్ దయాళ్ జయంతి వేడుకలు



**జగిత్యాల, సెప్టెంబర్ 25 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)** బీజేపీ సిద్ధాంతకర్త పండిత్ దీన్ దయాళ్ ఉపాధ్యాయ 109వ జయంతిని పురస్కరించుకొని బీజేపీ జిల్లా కార్యాలయంలో ఘనంగా వేడుకలు నిర్వహించారు. పార్టీ నాయకులు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షుడు రాచకొండ యాదగిరి బాబు, సేవాపక్ష కన్వీనర్ రాగిళ్ల సత్యనారాయణ మాట్లాడుతూ, ఉపాధ్యాయ గారి త్యాగ జీవితం, సామాజిక సేవలు, జనసంఘ్ నాయకత్వాన్ని కొనియాడారు. వారి ఆశయాలకు అనుగుణంగా ప్రధాని మోదీ పరిపాలన కొనసాగుతోందని, కార్యకర్తలు సేవా దృక్పథంతో ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. అదే సందర్భంగా మేధావుల సమావేశం నిర్వహించి, బీజేపీ అభివృద్ధి కార్యక్రమాలకు మద్దతు కోరారు. ప్రజలకు చేరే విధంగా మేధావులు తోడ్పాటు అందించాలని నాయకులు అభ్యర్థించారు. కార్యక్రమంలో రాష్ట్ర, జిల్లా, పట్టణ, మండల స్థాయి నాయకులు భోగ శ్రావణి, వడ్డేపల్లి శ్రీనివాసన్, నలువాల తిరుపతి, పిల్లి శ్రీనివాస్, మ్యాదరి అశోక్, జుంబర్తి దివాకర్, పాత రమేష్, తుకారాం గౌడ్, కొక్కు గంగాధర్, రెంటం జగదీష్, కుమ్మరి తిరుపతి, సిరికొండ రాజన్న, ఆముదరాజు, ఇట్యాల రాము, దురిశెట్టి మమత, జున్ను రాజేందర్, మరిపెల్లి సత్యం, చందోలి లక్ష్మణ్, బద్దెల గంగరాజం, దిటీ వెంకటేష్, కా. శెట్టి తిరుపతి, మామిడాల రాజగోపాల్, దురుశెట్టి రమణ, కళ్యాణ్ తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా పండిత్ దీన్ దయాళ్ జయంతి



**గంభీరావుపేట, సెప్టెంబర్ 25 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)** : బీజేపీ గంభీరావుపేట మండల శాఖ ఆధ్వర్యంలో పండిత్ దీన్ దయాళ్ ఉపాధ్యాయ 109వ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. మండల అధ్యక్షుడు కోడె రమేశ్ నేతృత్వంలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ, ఉపాధ్యాయ గారి అంత్యోదయ భావన, ఏకాత్మ మానవతావాదం నేటికీ బీజేపీకి మార్గదర్శకమని, ప్రధాని మోదీ ప్రభుత్వం ఆయన ఆశయాలకు అనుగుణంగా పథకాలు అమలు చేస్తోందని పేర్కొన్నారు. ఉజ్వల, జన్ ధన్, ఆవాస్, గ్రామ జ్యోతి వంటి పథకాల ద్వారా పేదలకు మేలు జరుగుతోందన్నారు. కార్యక్రమంలో మల్లేష్ యాదవ్, నాగరాజు గౌడ్, సర్వోత్తమ్, డాక్టర్ సత్యనారాయణ, శ్రీనివాస్ చారి, దేవేందర్ యాదవ్, శ్రీనివాస్ తదితర బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

## దుర్గాదేవి మండపంలో చండీయాగం నిర్వహించిన మంత్రి శ్రీధర్ బాబు

**ధన్వాడలో శరన్నవరాత్రుల సందర్భంగా ప్రత్యేక పూజలు**



**కాటారం, సెప్టెంబర్ 25 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)** భూపాలపల్లి జిల్లా కాటారం మండలం ధన్వాడ గ్రామంలోని దత్తాత్రేయ స్వామి ఆలయ ప్రాంగణంలో శరన్నవరాత్రుల సందర్భంగా ఏర్పాటు చేసిన దుర్గాదేవి మండపంలో తెలంగాణ రాష్ట్ర మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం గణపతి హోమం, నవగ్రహ హోమం, మహా చండీయాగంలో గ్రామ ప్రజలతో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, దుర్గామాత ఆశీస్సులతో రాష్ట్ర ప్రజలు ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో జీవించాలని, రైతులకు సకాలంలో వర్షాలు కురిసి అధిక దిగుబడులు రావాలని ఆకాంక్షించారు. అనంతరం వేద పండితుల ఆశీర్వచనం స్వీకరించారు.

# ఘనంగా పండిత్ దీన్ దయాళ్ జయంతి

**జిల్లా అధ్యక్షుడు రెడ్డ బోయిన గోపి నేతృత్వంలో నివాళులు**



**రాజన్న సిరిసిల్ల, సెప్టెంబర్ 25 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
: బీజేపీ జిల్లా కార్యాలయంలో పండిత్ దీన్ దయాళ్ ఉపాధ్యాయ 109వ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. జిల్లా అధ్యక్షుడు రెడ్డ బోయిన గోపి నేతృత్వంలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ, ఉపాధ్యాయ అంత్యోదయ సిద్ధాంతం, ఏకాత్మ మానవతావాదం దేశ సమగ్ర అభివృద్ధికి మార్గదర్శకమని, మోదీ ప్రభుత్వం ఆయన ఆశయాలకు అనుగుణంగా పథకాలు అమలు చేస్తోందని పేర్కొన్నారు. ఉజ్వల, జన్ ధన్, ఆవాస్, గ్రామ జ్యోతి, కౌశల్, బేటీ బచావో వంటి పథకాల ద్వారా పేదలకు మేలు జరుగుతోందన్నారు. కార్యక్రమంలో ఎర్రం మహేష్, లింగంపల్లి శంకర్, రాంప్రసాద్, శీలం రాజు, బర్కం లక్ష్మి, పొన్నాల తిరుపతిరెడ్డి, బర్కం నవీన్, ఆసాని రామలింగారెడ్డి, బాగన్న, జూకంటి అఖిల్, కాసుగంటి రాజు రావు, దుమాల శ్రీకాంత్, రేగుల సంతోష్ బాబు, ఇతర బీజేపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# ఎంపీడీవో కార్యాలయానికి శంకుస్థాపన చేసిన మంత్రి పొన్నం ప్రభాకర్



**హుస్నాబాద్, సెప్టెంబర్ 25 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
అక్కన్నపేట మండల కేంద్రంలో 1.50 కోట్ల అంచనా వ్యయంతో ఎంపీడీవో కార్యాలయానికి మంత్రి పొన్నం ప్రభాకర్ శంకుస్థాపన చేశారు. మండల ఏర్పాటైనప్పటి నుంచి కార్యాలయం లేక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని, వారి డిమాండ్ మేరకు నూతన కార్యాలయం మంజూరయ్యిందని మంత్రి తెలిపారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, ఎంపీడీవో కార్యాలయ పనులు త్వరగా పూర్తి చేయాలని, అలాగే ఎమ్మార్వో కార్యాలయ నిర్మాణం కూడా చేపడతామని పేర్కొన్నారు. హుస్నాబాద్ నియోజకవర్గంలోని అన్ని గ్రామాల్లో అభివృద్ధి పనులు కొనసాగుతున్నాయని, గౌరవెల్లి ప్రాజెక్ట్ పూర్తి చేస్తామని, రోడ్ల నిర్మాణాలు వేగంగా జరుగుతున్నాయని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ హైమవతి, అడిషనల్ కలెక్టర్ గరిమ అగర్వాల్, గ్రంథాలయ సంస్థ చైర్మన్ లింగమూర్తి, మార్కెట్ కమిటీ చైర్మన్ తిరుపతి రెడ్డి, సింగిల్ విండో చైర్మన్ శివయ్య, ఇతర నేతలు, అధికారులు పాల్గొన్నారు.

# బిఎంఎస్ బ్రాంచ్ ధ్రువీకరణ పత్ర సమర్పణ

**ఏఎల్పి మైన్ మేనేజర్ సునీల్ కుమార్‌కు ఘన సత్కారం**



**రామగుండం, సెప్టెంబర్ 25 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
సింగరేణి కోల్ మైన్స్ కార్మిక సంఘం బిఎంఎస్ ఆర్జీ–III ఏరియా ఆధ్వర్యంలో ఏఎల్పి మైన్ ఫిట్ కమిటీ నియామక సందర్భంగా బ్రాంచ్ కార్యదర్శి రౌతు రమేష్ అధ్యక్షతన, ఉపాధ్యక్షుడు అరుకాల ప్రసాద్ ముఖ్య అతిథిగా పాల్గొని మైన్ మేనేజర్ సునీల్ కుమార్‌కు ధ్రువీకరణ పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఫిట్ సెక్రటరీగా మీనుగు సంతోష్, అసిస్టెంట్ ఫిట్ సెక్రటరీలుగా కందుల మహేష్, చాట్ల వెంకటేష్, ఆర్గనైజింగ్ సెక్రటరీలుగా కనగంటి మహేష్, సాగర్, తిరుపతి బాధ్యతలు స్వీకరించారు. రిలే 'డీ' ఇన్‌చార్జ్‌గా రాయవేని రమేష్, 'ఏ' రిలేకు అరుణ్, 'బీ' రిలేకు బిమరి సంతోష్, 'సీ'రిలేకు వెంకట సాయి, '8 పీఎం' రిలేకు వావిలాల లక్ష్మణ్ నియమితులయ్యారు. బదిలీపై వెళ్తున్న ఏఎల్పి మైన్ మేనేజర్ సునీల్ కుమార్‌ను శాలువాతో ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో ఆర్గనైజర్ సెక్రటరీ జాడి వెంకటేష్, ఓసీపీ–I ఫిట్ సెక్రటరీ పాకా కృష్ణ, ఫిట్ కమిటీ సభ్యులు వెంకటేష్, సంతోష్, లక్ష్మణ్, తిరుపతి, ఇతర కార్మికులు, బిఎంఎస్ నాయకులు పాల్గొన్నారు.

# హుజురాబాద్ ఆసుపత్రిలో హెపటైటిస్ బి వాక్సినేషన్ ప్రారంభం

**మానకొండూర్ పీహెచ్‌సీ తనిఖీ చేసిన వైద్యాధికారులు**



**హుజురాబాద్, సెప్టెంబర్ 25 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
హుజురాబాద్ ప్రాంతీయ ఆసుపత్రిలో హెల్త్ కేర్ ప్రొవైడర్లకు హెపటైటిస్ బి వాక్సినేషన్ కార్యక్రమాన్ని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ వెంకటరమణ, పి ఓ డి టి డాక్టర్ ఉమాశ్రీ, ఉపవైద్యాధికారి డాక్టర్ చందు లాంఛనంగా ప్రారంభించారు. ఈ కార్యక్రమం నేషనల్ వైరల్ హెపటైటిస్ కంట్రోల్ ప్రోగ్రాం కింద వైద్య సిబ్బందికి రోగనిరోధక శక్తి పెంపొందించేందుకు చేపట్టినదిగా తెలిపారు. తర్వాత మానకొండూర్ పీహెచ్‌సీని సందర్శించిన అధికారులు హాజరు పట్టికలు, రిజిస్టర్లు, రోగుల వివరాలు పరిశీలించారు. పేషంట్లతో మాట్లాడి ఉచిత మందుల వినియోగంపై అవగాహన కల్పించారు. ఎన్‌సీడీ క్లినిక్, ఫార్మసీ స్టోర్ లో రికార్డులు, మందుల నిల్వలను తనిఖీ చేశారు. కార్యక్రమంలో హెల్త్ ఎడ్యుకేటర్ ప్రతాప్, డాక్టర్ సల్మాన్, ఇతర వైద్యాధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# డాక్టర్ వెంకటరమణ ఆధ్వర్యంలో అట్ల బతుకమ్మ వేడుకలు

**కరీంనగర్ వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయంలో పూల పండుగ**



**కరీంనగర్, సెప్టెంబర్ 25 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ వెంకటరమణ ఆధ్వర్యంలో బతుకమ్మ పండుగ 5వ రోజు అట్ల బతుకమ్మ వేడుకలు ఘనంగా నిర్వహించారు. మహిళా అధికారులు, కార్యాలయ సిబ్బంది తీరొక్క పూలతో బతుకమ్మలను పేర్చి ఉత్సాహంగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా డాక్టర్ వెంకటరమణ మాట్లాడుతూ, తెలంగాణ సాంస్కృతిక సంప్రదాయాన్ని కొనసాగిస్తూ, మహిళల మధ్య ఏకతా, స్నేహబంధం, సంప్రదాయ విలువలు పెంపొందించడమే ఈ పండుగ ఉద్దేశమన్నారు. కార్యక్రమంలో డాక్టర్ ఉమాశ్రీ, డాక్టర్ సాజిదా, డాక్టర్ సన జవేరియా, డాక్టర్ చందు, డెమో రాజగోపాల్, డిపిఓ స్వామి శ్రీనివాసులు, స్వాతి, కైక సరస్వతి, పట్టణ ఆరోగ్య కేంద్రం మహిళా సిబ్బంది పాల్గొన్నారు.

# ఆర్టీసీ ప్రయాణికులకు లక్కీ డ్రా బహుమతులు

**దసరా సందర్భంగా ప్రత్యేక పథకం**



**హుస్నాబాద్, సెప్టెంబర్ 25 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
దసరా పండుగ సందర్భంగా ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణించే వారికి లక్కీ డ్రా పథకం నిర్వహించనున్నట్లు హుస్నాబాద్ డిపో మేనేజర్ ఎస్. వెంకన్న తెలిపారు. సెప్టెంబర్ 27 నుంచి అక్టోబర్ 6 వరకు సెమీ డీలక్స్, డీలక్స్, మెట్రో డీలక్స్, సూపర్ లగ్జరీ, లహరి, ఏసీ బస్సుల్లో ప్రయాణించే వారు తమ టికెట్‌పై పేరు, ఫోన్ నంబర్, చిరునామా వ్రాసి బస్ స్టేషన్‌లో ఏర్పాటు చేసిన బాక్సుల్లో వేయాలి. అక్టోబర్ 8న సాయంత్రం 4 గంటలకు ప్రాంతీయ కార్యాలయంలో జిల్లా అధికారుల సమక్షంలో లక్కీ డ్రా నిర్వహించనున్నారు. ప్రతి ప్రాంతం నుంచి ముగ్గురు విజేతలు ఎంపిక చేయబడతారు. మొదటి బహుమతి 25,000, రెండవ బహుమతి 15,000, మూడవ బహుమతి 10,000 నగదు రూపంలో అందించనున్నారు. ఈ అవకాశాన్ని ప్రయాణికులు సద్వినియోగం చేసుకోవాలని డిపో మేనేజర్ సూచించారు.

# రామగుండం ఏటీసీ సెంటర్‌ను సందర్శించిన ఎమ్మెల్యే రాజ్ ఠాకూర్



**రామగుండం, సెప్టెంబర్ 25 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
రామగుండం నియోజకవర్గ ఎమ్మెల్యే ఎం.ఎస్. రాజ్ ఠాకూర్ ఏటీసీ సెంటర్‌ను సందర్శించారు. నేడు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రాష్ట్రవ్యాప్తంగా ఏటీసీ సెంటర్లను ప్రారంభించనున్న నేపథ్యంలో, స్థానిక సెంటర్‌ను ముందుగా పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, రామగుండం ప్రాంత అభివృద్ధికి ఏటీసీ సెంటర్ కీలకంగా నిలుస్తుందని, భవిష్యత్తులో మరిన్ని సదుపాయాలు కల్పించేలా చర్యలు తీసుకుంటానని తెలిపారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

# మంథని కోర్టు ఆవరణలో బతుకమ్మ సంబరాలు

**న్యాయవాదులు, కోర్టు సిబందితో కలిసి పాల్గొన్న సీనియర్ జడ్జి**



**మంథని, సెప్టెంబర్ 25 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
మంథని కోర్టు ఆవరణలో గురువారం మధ్యాహ్నం బతుకమ్మ పండుగను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సీనియర్ సివిల్ జడ్జి వి. భవాని, మహిళా న్యాయవాదులు జి. శ్రీలక్ష్మి, బండ మాధురి, కోర్టు సిబంది, బార్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడు కే. రఘోత్తం రెడ్డి, ప్రధాన కార్యదర్శి యం. సహేందర్ రెడ్డి, గ్రంథాలయ కార్యదర్శి కటుకం శ్రీనివాస్, ఏజీపి బి. ఆంజనేయులు, సదన్ కుమార్, శశి భూషణ్ కాచె, మంథని శ్రీనివాస్, వ్యాస్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# హుజూరాబాద్ అభివృద్ధికి ప్రణవ్ కృషి

**అంబేద్కర్ చౌరస్తాలో కాంగ్రెస్ శ్రేణుల సంబరాలు**



**హుజూరాబాద్, సెప్టెంబర్ 25 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
: హుజూరాబాద్, జమ్మికుంట మున్సిపాలిటీలకు చెరో 15 కోట్లు ం మొత్తం 30 కోట్ల నిధులు మంజూరైన నేపథ్యంలో అంబేద్కర్ చౌరస్తాలో కాంగ్రెస్ పార్టీ శ్రేణులు పాలాభిషేకంతో సంబరాలు నిర్వహించారు. నియోజకవర్గ అభివృద్ధికి ప్రణవ్ నాయకత్వమే కారణమని నేతలు పేర్కొన్నారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డి, మంత్రులు పొన్నం, శ్రీధర్ బాబు, ఇంచార్జి మంత్రి తుమ్మల నాగేశ్వరరావు చిత్రపటాలకు పాలాభిషేకం చేశారు. కాంగ్రెస్ హయంలో మున్సిపాలిటీల అభివృద్ధికి ప్రాధాన్యం ఇస్తున్నామని, ఉప ఎన్నిక తర్వాత నిధులు రాకపోయినా ప్రణవ్ కృషితో నేడు నిధులు మంజూరయ్యాయని నేతలు తెలిపారు. కార్యక్రమంలో హుజూరాబాద్ పట్టణ, మండల అధ్యక్షులు, మహిళా అధ్యక్షురాళ్లు, బ్లాక్ కాంగ్రెస్, యూత్, యువజన కాంగ్రెస్, మైనారిటీ, బీసీ, ఎస్సీ సెల్, సేవాదళ్ నాయకులు పాల్గొన్నారు.

# కరీంనగర్ డీసీసీ కార్యాలయంలో ఆదివాసీ కాంగ్రెస్ శిక్షణ ప్రారంభం

**పాల్గొన్న మంత్రులు పొన్నం, లక్ష్మణ్ కుమార్**



**హుస్నాబాద్, సెప్టెంబర్ 25 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
ఉమ్మడి కరీంనగర్ జిల్లా ఆదివాసీ కాంగ్రెస్ కార్యకర్తల రెండు రోజుల శిక్షణ సమ్మేళనాన్ని కరీంనగర్ డీసీసీ కార్యాలయంలో ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి రాష్ట్ర రవాణా మరియు బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ, దివ్యాంగుల సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ప్రారంభంలో సేవలాల్ మహారాజ్, డా. బి.ఆర్. అంబేద్కర్ చిత్రపటాలకు పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. కార్యక్రమంలో మాజీ రాష్ట్ర హౌజ్ ఫెడ్ చైర్మన్ బొమ్మ శ్రీరామ్ చక్రవర్తి, ఇతర ముఖ్య నాయకులు పాల్గొన్నారు.

# మద్యం దుకాణాలకు రిజర్వేషన్లు ఖరారు

**నేడు నోటిఫికేషన్ విడుదల**



**కరీంనగర్, సెప్టెంబర్ 25 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
జిల్లాలో మద్యం దుకాణాల నిర్వహణకు రిజర్వేషన్లు ఖరారయ్యాయి. 94 దుకాణాల్లో 17 గీత కార్మికులకు, 9 ఎస్సీ కేటగిరీకి డ్రా పద్ధతిలో ఎంపిక చేశారు. ఈ ప్రక్రియను జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి ఆధ్వర్యంలో పూర్తి చేశారు. ప్రస్తుత లైసెన్స్ కాలపరిమితి నవంబర్ 30తో ముగియనున్న నేపథ్యంలో, డిసెంబర్ 1 నుంచి కొత్త టెండర్లను ఖరారు చేసేందుకు శుక్రవారం నోటిఫికేషన్ విడుదల చేయనున్నట్లు ఎక్సైజ్ సూపరింటెండెంట్ పి. శ్రీనివాస్ రావు తెలిపారు. కార్యక్రమంలో బీసీ సంక్షేమ అధికారి అనిల్ ప్రకాష్, ఎస్సీ సంక్షేమ శాఖ డిడి నాగలేశ్వర్, సీఐలు జి. రాము, ఎస్. అశోక్, ఎస్. బాబా, ఎస్ఐలు ఇషాఖ్ పాషా, విజయ్, ఎక్సైజ్ సిబ్బంది అనిల్, సాయి కృష్ణ పాల్గొన్నారు.

# వర్షాల నేపథ్యంలో అప్రమత్తంగా ఉండాలని జిల్లా కలెక్టర్ సూచన

**- బొక్కలగుట్ట చెరువు వద్ద పరిస్థితిని పరిశీలించిన కుమార్ దీపక్**



**మంచిర్యాల, సెప్టెంబర్ 25 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
: జిల్లాలో కురుస్తున్న వర్షాల నేపథ్యంలో అధికారులు అప్రమత్తంగా ఉండాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ సూచించారు. మందమర్రి మండలం బొక్కలగుట్ట గ్రామం వద్ద గాంధారిఖిల్లా సమీపంలోని చెరువుకు గండి పడిన నేపథ్యంలో తహసిల్దార్ సతీష్, నీటిపారుదల శాఖ డీఈ శారద లతో కలిసి కలెక్టర్ పరిస్థితిని పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, వరదల వల్ల ప్రమాదాలు తలెత్తకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని, ప్రజలను అప్రమత్తం చేస్తూ నిరంతర పర్యవేక్షణ కొనసాగించాలని అధికారులను ఆదేశించారు .కార్యక్రమంలో సంబంధిత శాఖల అధికారులు, స్థానిక ప్రతినిధులు పాల్గొన్నారు.

# రైల్వే వంతెనపై సమీక్ష సమావేశం

**మడిపల్లిలో ఆర్‌ఓబీ నిర్మాణానికి రైతుల అభ్యంతరాలపై చర్చ**




**కరీంనగర్, సెప్టెంబర్ 25 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
జిల్లాకేంద్రంలోని కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాలులో గురువారం జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి అధ్యక్షతన, అదనపు కలెక్టర్ లక్ష్మీ కిరణ్, హుజురాబాద్ ఆర్డీవో రమేష్ బాబు, రైల్వే, రెవెన్యూ, నీటిపారుదల శాఖ అధికారులు పాల్గొన్న సమీక్ష సమావేశం జరిగింది. జమ్మికుంట మండలం మడిపల్లిలో రైల్వే లైన్ ఉన్న ప్రాంతంలో నిర్మించనున్న ఆర్‌ఓబీ వంతెనపై ఈ సమీక్ష నిర్వహించారు. వంతెన నిర్మాణానికి వ్యవసాయ భూములు కోల్పోతామని స్థానిక రైతులు అభ్యంతరం వ్యక్తం చేయడంతో, వారి సమస్యలపై చర్చ జరిపారు. క్షేత్రస్థాయికి వెళ్లి జాయింట్ సర్వే నిర్వహించాలని, రైతులతో ప్రత్యక్షంగా మాట్లాడి వారి ఇబ్బందులను తెలుసుకోవాలని, సమీపంలోని కచ్చా రోడ్ల వివరాలు సేకరించాలని అధికారులను కలెక్టర్ ఆదేశించారు. అడ్డంకులు తొలిగేలా పూర్తి వివరాలతో నివేదిక అందించాలని సూచించారు. ఈ సమావేశంలో రైల్వే చీఫ్ ఇంజనీర్ (సికింద్రాబాద్) శర్మ శ్రీవాణి, ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు.

# కరీంనగర్ అభివృద్ధికి కలిసి కృషి చేస్తున్నాం

**మంత్రి పొన్నం ప్రభాకర్**



**కరీంనగర్, సెప్టెంబర్ 25 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
ప్రజల సంక్షేమమే తమ మొదటి ప్రాధాన్యత అని రాష్ట్ర బీసీ రవాణాశాఖ మంత్రి శ్రీ పొన్నం ప్రభాకర్ స్పష్టం చేశారు. హుస్నాబాద్ నియోజకవర్గంతో పాటు కరీంనగర్ పార్లమెంట్ అభివృద్ధి విషయంలో రాజకీయాలకు అతీతంగా కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి శ్రీ బండి సంజయ్ కుమార్‌తో కలిసి పనిచేస్తున్నామని తెలిపారు. దసరా నవరాత్రి ఉత్సవాలను పురస్కరించుకుని బండి సంజయ్ ఆహ్వానం మేరకు కరీంనగర్ మహాశక్తి అమ్మవారి ఆలయాన్ని మంత్రి పొన్నం ప్రభాకర్ దర్శించుకున్నారు. ఈ సందర్భంగా బండి సంజయ్, మాజీ ఎమ్మెల్యే ఆరెపల్లి మోహన్‌తో కలిసి మీడియాతో మాట్లాడారు. గత 18 ఏళ్లుగా బండి సంజయ్ అమ్మవారి మాల వేసుకుని “సర్వేజనా సుఖినోభవ” దీక్షతో నవరాత్రి ఉత్సవాలు నిర్వహిస్తున్నారని పొన్నం అభినందించారు. రాజకీయాలు వేరు, అభివృద్ధి వేరు” అని స్పష్టంగా పేర్కొన్న మంత్రి, నియోజకవర్గ అభివృద్ధి కోసం సహృదయ వాతావరణంలో కలిసి పనిచేస్తున్నామని తెలిపారు. హుస్నాబాద్ సహా కరీంనగర్ పార్లమెంట్ పరిధిలోని ప్రజా సమస్యలను కేంద్ర మంత్రిగా ఉన్న బండి సంజయ్ దృష్టికి తీసుకెళ్తున్నామని, ఆయన సహకారం లభిస్తున్నదని వివరించారు. తామిద్దరూ విద్యార్థి సంఘం నుండి ఎదిగిన నేతలమని, ప్రజల సంక్షేమమే తమ లక్ష్యమని మంత్రి పొన్నం ప్రభాకర్ పేర్కొన్నారు. జిల్లా అభివృద్ధిలో తమ పాత్ర స్పష్టంగా ఉండేలా కృషి చేస్తున్నామని తెలిపారు.

# పిల్లల భద్రతపై అప్రమత్తంగా ఉండాలి

**- మనందరి బాధ్యత**
**-దసరా సెలవుల్లో తల్లితండ్రులకు**
**పోలీస్ కమిషనర్ అనురాధ సూచనలు**

**హుస్నాబాద్, సెప్టెంబర్ 25 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**




దసరా సెలవుల నేపథ్యంలో పిల్లల భద్రతపై తల్లితండ్రులు అప్రమత్తంగా ఉండాలని పోలీస్ కమిషనర్ డాక్టర్ బి. అనురాధ, ఐపీఎస్ సూచించారు. నేటి బాలలే రేపటి పౌరులుగా, భవిష్యత్తు భారతావనికి పునాదులుగా నిలుస్తారని, వారిని కంటికి రెప్పలాగా కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని ఆమె పేర్కొన్నారు. ప్రతి సంవత్సరం సెలవుల్లో అమాయక విద్యార్థులు ఆకారణంగా ప్రాణాలు కోల్పోయి, వారి తల్లితండ్రులకు తీరని బాధ మిగిలిపోతున్నదని ఆవేదన వ్యక్తం చేశారు. పిల్లలు తల్లితండ్రులకు తెలియకుండా ఎక్కడికైనా వెళ్లకుండా, మిత్రులతో కలిసి ఆడుకుంటూ చెరువులు, వాగులు, బావులు, కుంటలు వంటి ప్రమాదకర ప్రాంతాలకు వెళ్లకుండా ఉండేలా వారిని హెచ్చరించాల్సిన అవసరం ఉందని తెలిపారు. ఈత రాకుండా ఉత్సాహంతో నీటిలోకి దిగడం ప్రమాదకరమని, జిల్లాలోని నీటి మడుగులు నిండుగా ఉన్నందున పిల్లలను వాటికి దగ్గర చేయరాదని ఆమె సూచించారు. తల్లితండ్రులు తమ పిల్లల భవిష్యత్తు కోసం కష్టపడుతున్నప్పటికీ, సెలవుల్లో వారి రక్షణ పట్ల మరింత జాగ్రత్తగా ఉండాలని, ప్రమాదాల బారిన పడకుండా కాపాడుకోవాలని కమిషనర్ డాక్టర్ అనురాధ పిలుపునిచ్చారు.

# దుర్గామాత మండపంలో ‘ఆపరేషన్ సింధూర్’ నాటికతో దేశభక్తి సందేశం

**కరీంనగర్ టవర్ సర్కిల్ ఉత్సవాల్లో ప్రజల హర్షాతిరేకం**

**కరీంనగర్, సెప్టెంబర్ 25 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**




దుర్గామాత ఉత్సవాల సందర్భంగా కరీంనగర్ టవర్ సర్కిల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో ‘ఆపరేషన్ సింధూర్’ నాటికను ప్రదర్శించారు. మన దేశ సైనిక శక్తి, దేశభక్తి, మహిళా నాయకత్వం వంటి అంశాలను నాటక రూపంలో ప్రజలకు అందించడంతో భక్తులు, ప్రేక్షకులు హర్షాతిరేకంగా స్పందించారు. ఈ నాటికలో మోడీ చేపట్టిన ఆపరేషన్ సింధూర్ విజయగాథను ఒక మహిళా నాయకత్వంలో ఎలా సాధించారో వివరించారు. భారత మిలిటరీ గొప్పతనాన్ని, దేశం కోసం చేసే త్యాగాలను, ప్రజల భద్రత కోసం తీసుకునే చర్యలను నాట్యరూపంలో చూపించడం ద్వారా చిన్నా పెద్దా అందరిలో దేశభక్తి భావనను పెంపొందించారు ఈ తరహా నాటికలు పిల్లల్లో ధైర్యాన్ని, పౌర బాధ్యతను, దేశం పట్ల గౌరవాన్ని కలిగిస్తాయని నిర్వాహకులు పేర్కొన్నారు. ఉత్సవాల్లో భాగంగా ఇలాంటి ప్రదర్శనలు మరిన్ని నిర్వహించాలని ప్రజలు అభిప్రాయపడ్డారు.

# స్థానిక ఎన్నికల షెడ్యూల్ రేపే?..

**-దసరా తర్వాత ఎప్పుడైనా నోటిఫికేషన్**
**- నేడు రేపు రిజర్వేషన్ల జీవో జారీ?**
**- ఇప్పటికే సిద్ధంచేసిన యంత్రాంగం!**

**హైదరాబాద్ సెప్టెంబర్ 25 ( నీలగిరి ఎక్స్ ప్రెస్ )**




స్థానిక సంస్థల ఎన్నికల షెడ్యూల్ ఈ నెల 26 లేదా 27న జారీ అవుతుందా? దసరా తర్వాత ఏ క్షణమైనా నోటిఫికేషన్ విడుదల అవుతుందా? అంటే రాష్ట్రంలో అధికార యంత్రాంగం వడివడిగా చేపట్టిన ఎన్నికల ముందస్తు కసరత్తు దానికి సంకేతంగా కనిపిస్తున్నది. దసరా తర్వాత ఏ క్షణమైనా ఎన్నికల నిర్వహణకు రాష్ట్ర ప్రభుత్వం నోటిఫికేషన్ విడుదల చేస్తుందని సమాచారం. చట్టబద్ధంగా నిలుస్తుందా? లేదా? అన్నదానితో సంబంధం లేకుండా హైకోర్టు తీర్పు నేపథ్యంలో ఏర్పాట్లకే సిద్ధమవుతున్నది. ఎన్నికల నిర్వహణకు ప్రభుత్వం తన సంసిద్ధతను తెలుపుతూ రాష్ట్ర ఎన్నికల సంఘానికి నేడో, రేపో లేఖ రాసే అవకాశం ఉన్నది. రిజర్వేషన్ల వివరాలను అందించనున్నట్టు సమాచారం. స్థానిక సంస్థల్లో బీసీల రిజర్వేషన్లపై శుక్రవారం ఉదయం శనివారం జీవో జారీ చేస్తారని, ఆ జీవోతోపాటు షెడ్యూల్ ఒకే సమయంలో వచ్చేలా ఏర్పాట్లు చేస్తున్నట్టు తెలుస్తున్నది. ఎన్నికల ప్రక్రియను ఒకసారి మొదలుపెట్టిన తర్వాత కోర్టులు పెద్దగా జోక్యం చేసుకోకపోవచ్చున్న భావనతో అధికారులు ఉన్నారు. స్థానిక ఎన్నికల్లో బీసీలకు 42% రిజర్వేషన్లను కల్పిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికే పంపిన బిల్లు ఇంకా ఆమోదం పొందలేదు. ఈ బిల్లు రాష్ట్రపతి వద్ద పెండింగ్‌లో ఉన్నది. ఈ నేపథ్యంలో బీసీల రిజర్వేషన్ల కోసం జీవో ఇవ్వాలని ప్రభుత్వం భావిస్తుండగా, డ్రాఫ్ట్ జీవోను ఇప్పటికే సిద్ధంచేశారు. న్యాయ, సంక్షేమ శాఖ ల కార్యదర్శుల పరిశీలన కూడా పూర్తయి సీఎంవోలో ఉన్నది. 26న స్థానిక సంస్థల ఎన్నికలకు షెడ్యూల్ ఇచ్చి దసరా తర్వాత ఎన్నికల నోటిఫికేషన్ ఇవ్వాలని భావిస్తున్నట్టు తెల్సింది. హైకోర్టు ఈనెల 30లోపు స్థానిక ఎన్నికలు నిర్వహించాలని చెప్పిన నేపథ్యంలో ఎన్నికల ప్రక్రియను మొదలు పెట్టామని ప్రభుత్వం కోర్టుకు చెప్పుకునేందుకు 26న షెడ్యూల్ ప్రకటించే అవకాశం ఉన్నట్టు చెప్తున్నారు.

**- రేపు, ఎల్లుండి పోలింగ్ అధికారులకు శిక్షణ**

రాష్ట్రంలో పంచాయతీ ఎన్నికల నిర్వహణకు అవసరమైన పోలింగ్ అధికారుల(పీవో)ను నియమించాలని అన్ని కలెక్టర్లకు రాష్ట్ర ఎన్నికల సంఘం కార్యదర్శి లేఖలు రాశారు. నియమించిన పీవోలకు రెండు రోజులపాటు జిల్లాల వారీగా శిక్షణ కార్యక్రమాలు ఏర్పాటు చేయాలని పేర్కొన్నారు. ఈ నెల 26, 27న డివిజన్ల వారీగా శిక్షణ ఏర్పాట్లు చేశారు.

# స్వదేశీ వస్తువులను ప్రోత్సహించండి

**- దేశాభివృద్ధికి తోడ్పడండి**
**- కేంద్ర సహాయ మంత్రి బండి సంజయ్**




**కరీంనగర్, సెప్టెంబర్ 25 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
దేశ అభివృద్ధికి ప్రతి ఒక్కరూ స్వదేశీ వస్తువులను ప్రోత్సహించాలని, ఆత్మనిర్భర్ భారత్ లక్ష్య సాధనకు భాగస్వాములవ్వాలని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ పిలుపునిచ్చారు. స్వరాజ్ ట్రాక్టర్ల పంపిణీ కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, దేశంలో తయారైన వస్తువులను కొనుగోలు చేయడం ద్వారా స్థానిక పరిశ్రమలు, చిన్నతరహా వ్యాపారాలు బలపడతాయి, ఉద్యోగావకాశాలు పెరుగుతాయి, ఆర్థిక వ్యవస్థ బలోపేతమవుతుంది, డబ్బు దేశంలోనే చలామణి అవుతుంది అని వివరించారు. జీఎస్టీ సంస్కరణల ఫలితంగా స్వరాజ్ ట్రాక్టర్ల ధరలు రూ.40 వేల నుండి రూ.80 వేల వరకు తగ్గినట్లు డీలర్స్ అసోసియేషన్ తెలిపింది. రైతులు ఈ తగ్గింపుతో స్వరాజ్ ట్రాక్టర్లు కొనుగోలు చేస్తూ ఆనందం వ్యక్తం చేశారు. మక్కపల్లికి చెందిన రైతు అఖిల్ రూ.70 వేలు, లింగాపూర్‌కు చెందిన అనిల్ కుమార్, నుస్తులాపూర్‌కు చెందిన వెంకటేశ్ యాదవ్ రూ.50 వేలు చొప్పున ఆదా అయ్యిందని తెలిపారు. డీలర్ వెంకట్ మాట్లాడుతూ, జీఎస్టీ తగ్గింపుతో ట్రాక్టర్ల అమ్మకాలు గణనీయంగా పెరిగాయని, రైతుల స్పందన అద్భుతంగా ఉందని పేర్కొన్నారు. కార్యక్రమంలో డీలర్స్ అసోసియేషన్ నాయకులు ట్రాక్టర్లను కేంద్ర మంత్రి చేతుల మీదుగా రైతులకు అందజేశారు. ఈ సందర్భంగా బండి సంజయ్ మాట్లాడుతూ, జీఎస్టీ వల్ల కలుగుతున్న ప్రయోజనాలను చుట్టుపక్కల వారికి వివరించి, స్వదేశీ వస్తువుల వినియోగాన్ని ప్రోత్సహించాలని ప్రజలను కోరారు.

# లోయర్ మానేరు డ్యామ్ వద్ద స్వచ్ఛతా హీ సేవా 2025

**-మంత్రి పొన్నం ప్రభాకర్ నేతృత్వంలో శ్రమదానం**



**కరీంనగర్, సెప్టెంబర్ 25 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
స్వచ్ఛతా హీ సేవా 2025 కార్యక్రమం కరీంనగర్ నగరంలో ఉత్సాహంగా కొనసాగింది. “ఒక రోజు - ఒక గంట -ఒకే సమయం” అనే నినాదంతో లోయర్ మానేరు డ్యామ్ పరిసరాల్లో శ్రమదానం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి రాష్ట్ర పర్యావరణ, అటవీ శాఖ మంత్రి శ్రీ పొన్నం ప్రభాకర్ స్వయంగా హాజరై చీపురు పట్టి పరిసరాలను శుభ్రం చేశారు. విద్యార్థులతో కలిసి ప్లాస్టిక్ వ్యర్థాలను తొలగిస్తూ, పరిశుభ్రతపై ప్రజల్లో అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ శ్రీమతి పమేలా సత్పతి, నగరపాలక సంస్థ కమిషనర్ శ్రీ ప్రఫుల్ దేశాయ్, సుడా చైర్మన్ శ్రీ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి, ప్రముఖ నాయకులు శ్రీ వెలిచాల రాజేందర్ రావు తదితర అధికారులు పాల్గొన్నారు. మానేరు డ్యామ్ వద్ద పోలీస్, అటవీ శాఖ, పరిశుభ్రత సిబ్బంది సమిష్టిగా శ్రమదానం చేశారు. మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ, పరిశుభ్రత కార్యక్రమాలు ఒకరోజు మాత్రమే జరిగే కార్యక్రమాలు కావని, ఇవి నిరంతర ప్రక్రియగా కొనసాగాలని సూచించారు. హైదరాబాద్‌లో ఓ విద్యార్థి ప్రతి ఆదివారం రెండు గంటలు సరస్సులు శుభ్రం చేస్తున్న ఉదాహరణను ప్రస్తావిస్తూ, ప్రతి ఒక్కరూ అలాంటి అలవాట్లు అలవరచుకోవాలని పిలుపునిచ్చారు. తిన్న తర్వాత వచ్చే ప్లాస్టిక్ కవర్లు, ఇతర వ్యర్థాలను రోడ్లపై వేయకుండా తడి, పొడి చెత్త వేరు చేసి పారవేయాలని సూచించారు. పర్యావరణ పరిరక్షణతోనే ఆరోగ్యకర సమాజం ఏర్పడుతుందని, భవిషత్ తరాలకు ఆరోగ్యాన్ని అందించాలంటే మొక్కలు పెంచడం, ఎలక్ట్రిక్ వాహనాల వినియోగం వంటి చర్యలు తీసుకోవాలని మంత్రి పేర్కొన్నారు. దేశ రాజధానిలో ఉన్న కాలుష్య పరిస్థితులు తెలంగాణలో రాకుండా ఉండేందుకు ప్రభుత్వం పెద్ద ఎత్తున మొక్కలు పెంచే కార్యక్రమాలు చేపట్టిందని తెలిపారు. కరీంనగర్‌లో ఎల్ఎండి డ్యామ్, పక్కనే ఉన్న ఎలగందుల కోట వంటి ప్రదేశాల్లో అన్ని సౌకర్యాలు ఉన్నాయని, ప్రజల భాగస్వామ్యంతో సమాజ సేవను ముందుకు తీసుకెళ్లాలని ప్రభుత్వ పక్షాన మంత్రి కోరారు.



**కరీంనగర్ పట్టణంలో గురుద్వారా సాహెబ్ నుండి ఇందిరా చౌక్ వరకు జరుగుతున్న 350 వ సహేది శతాబ్ది నగర్ కీర్తన యాత్రలో గురుద్వారా వద్ద యాత్రలో పాల్గొని ప్రార్థనలు చేసిన మంత్రి పొన్నం ప్రభాకర్**